ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
1 శ్రీకాకుళం జిల్లా వార్తలు
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

వేల కోట్ల ఆదాయం..

మద్యం ధరలు పెంచి ప్రభుత్వం సొమ్ము చేసుకుంది. షాక్ కొట్టించేలా ధరలు ఉంటే మందుబాబులు అటువైపు చూడడం మానేస్తారని సీఎం జగన్ ప్రకటించారు. కానీ జిల్లాలో మద్యం అమ్మకాల ద్వారా ఐదేళ్లలో రూ.6,383 కోట్లు ఆదాయం రావడం గమనార్హం. 2019-20 ఆర్థిక సంవత్సరంలో రూ.1027కోట్లు, 2020-21 ఆర్థిక సంవత్సరంలో రూ.1,080 కోట్లు, 2021-22 ఆర్థిక సంవత్సరంలో రూ.1345 కోట్లు, 2022-23 ఆర్థిక సంవత్సరంలో రూ.1,421కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరంలో రూ.1,510 కోట్ల ఆదాయం సమకూరింది.



ఊడ్చేశారు

- ఐదేళ్లలో రూ.6,383 కోట్ల మద్యం విక్రయాలు
- మద్య నిషేధంపై అటకెక్కిన జగన్ హామీ
- దశలవారీ దుకాణాల తగ్గింపు ఉత్తిమాటే
- వైసీపీ తీరుపై మండి పడుతున్న మహిళలు

(రణస్థలం)

వైసీపీ పాలనలో మద్యం విషయంలో చిత్రవిచిత్రాలు చోటుచేసుకున్నాయి. సంపూర్ణ మద్య నిషేధం అమలు చేశాకే 2024 ఎన్నికల్లో ఓట్లు అడుగుతానన్న జగన్.. ఆ విషయాన్ని విస్మరించారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇచ్చిన మాట ప్రకారం అధికారంలోకి వచ్చిన తొలి ఏడాది షాపులు తగ్గించినా.. తర్వాత రకరకాల పేర్లతో పెంచేశారు. ప్రస్తుత ఎన్నికల వేళ మరింత జోరుగా మద్యం విక్రయాలు చేపడుతున్నారు. ఐదేళ్లలో కేవలం జిల్లాలోనే రూ. 6,383 కోట్లు మేర మద్యం విక్రయించారు. ఈ నేపథ్యంలో జగనన్నా.. ఇదేనా మద్యనిషేధం అంటూ మహిళలు ప్రశ్నిస్తున్నారు.

● గత టీడీపీ ప్రభుత్వ హయాంలో జిల్లాలో 235 ప్రైవేటు మద్యం దుకాణాలు ఉండేవి. టెండరు ప్రక్రియ ద్వారా లైసెన్స్ ఇచ్చి మద్యం షాపులకు అనుమతిచ్చేవారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత నూతన పాలసీ అమలు చేసి.. ప్రభుత్వమే నేరుగా మద్యం విక్రయాలు చేపడుతోంది. జిల్లాలో 178 మద్యం దుకాణాలు ఏర్పాటు చేసింది. ఇందులో ఏటా 25 శాతం దుకాణాలను తగ్గిస్తామని జగన్ చెప్పారు. ఈ లెక్కన 44 షాపులు తగ్గాలి. కానీ ఇప్పుడు 193 షాపులు నడుస్తున్నాయి. ఉన్న షాపులను తగ్గించకపోగా.. కొత్తగా టూరిజం ఔట్ లెట్ల పేరుతో మరికొన్నింటిని ఏర్పాటు చేశారు. ఇక బార్లు 18వరకూ కొనసాగుతున్నాయి.

● అన్నింటా వసూళ్లు..

ప్రభుత్వ మద్యం దుకాణాల్లో సేల్స్‌మెన్లు ఇద్దరు, సూపర్‌వైజరు ఒకరిని నియమించారు. వీరి నియామకం విషయంలో వైసీపీ నేతలకు కాసులు ముట్టాయన్న ఆరోపణలున్నాయి. ఎక్సైజ్ ఉన్నతాధికారులు, అధికార పార్టీ నేతలు కలిసి ఒక్కో పోస్టును రూ.30వేల నుంచి రూ.50 వేల వరకూ అమ్ముకున్నట్టు బాధితులే ఆరోపించారు. ఇటీవల బదిలీల్లో కూడా భారీగా నగదు చేతులు మారినట్టు ఆరోపణలు వినిపించాయి. దీనిపై 'ఆంధ్రజ్యోతి' సమగ్ర కథనం రాయడంతో అవినీతి అధికారులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. షాపుల అద్దెల విషయంలో సైతం వైసీపీ నేతలు భారీగా సొమ్ము వెనుకేసుకున్నారు. ప్రతీ దుకాణం నుంచి అధికారులు కార్యాలయాల నిర్వహణ పేరుతో రూ.2వేల నుంచి రూ.3వేల వరకూ వసూలు చేస్తున్నట్టు తెలుస్తోంది. అయితే గ్రామాల్లో బెల్టు దుకాణాలకు సరుకు పక్కదారి పట్టించడం, నకిలీ మద్యం విక్రయించడం వంటి వాటి విషయంలో కొందరు అధికారులు సిబ్బందిని సైతం తప్పుదోవ పట్టించినట్టు తెలుస్తోంది. గత ఏడాది డిసెంబరులో కోటబొమ్మాళి ప్రభుత్వ మద్యం దుకాణంలో విజిలెన్స్ అధికారుల తనిఖీలో ఏకంగా 1000 వరకూ కల్తీ మద్యం సీసాలు పట్టుబడ్డాయి.

● సముద్ర మార్గంలో సారా, మద్యం..

అక్రమ మద్యం, సారా గురించి చెప్పనవసరం లేదు. చివరకు పొరుగు జిల్లాల మద్యాన్ని తెచ్చి చలామణి చేశారు. పట్టణాల్లో సైతం సారా ప్రవాహం అధికమైంది. 2022 జనవరి 26న కవిటి మండలం కొత్తపాలెం తీరంలో పడవలపై తెస్తున్న 6000 సారా ప్యాకెట్లను పోలీసులు పట్టుకున్నారు. ఒడిశాలోని నువగాం నుంచి సముద్ర మార్గంలో బోట్లపై తెస్తుండగా.. ముందస్తు సమాచారం అందుకున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులు పోలీస్ శాఖ సాయంతో పట్టుకున్నారు. అలాగే 2022 డిసెంబరు 3న రణస్థలం మండలం దన్నానపేట జాతీయ రహదారిపై 3 వేల మద్యం బాటిళ్లను పోలీసులు పట్టుకున్నారు. తెలంగాణ లేబుళ్లతో ఒడిశా నుంచి విజయనగరం వ్యాన్‌లో తరలిస్తుండగా ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అదంతా నకిలీ మద్యంగా తేలింది. కానీ ఎందుకో ఆ కేసు వివరాలు మళ్లీ బయటకు రాలేదు. ఇలా ఎక్కడికక్కడ సారా, మద్యం విక్రయాలు జోరుగా సాగుతుండడంతో వైసీపీ పాలన తీరుపై మహిళలు మండిపడుతున్నారు. మద్య నిషేధం హామీ అటకెక్కినట్టేనని ఆరోపిస్తున్నారు. ఈసారి ఎన్నికల్లో వైసీపీకి బుద్ధి చెప్పడం ఖాయమని స్పష్టం చేస్తున్నారు.

●
మద్యం పచ్చని కుటుంబాల్లో చిచ్చు రేపుతూ.. గొడవలకు కారణమవుతోంది. నీరు లేని గ్రామాన్ని చూస్తున్నా కానీ.. బెల్ట్ దుకాణం లేని ఊరు లేదు. అందుకే అధికారంలోకి వచ్చిన మరుక్షణమే మద్య నిషేధం అమలు చేస్తా. నా అక్కాచెల్లెళ్ల కళ్లల్లో ఆనందం చూస్తా. నవరత్నాల్లో సంపూర్ణ మద్య నిషేధం పొందుపరిచా. మహిళలు నాకు అండగా నిలవండి. ఓట్లు వేసి గెలిపించండి. మీ కళ్లల్లో ఆనందం నింపే బాధ్యత నాది.

-ఇదీ విపక్ష నేతగా పాదయాత్ర చేసినప్పుడు, గత ఎన్నికల్లో వైఎస్ జగన్మోహన్‌రెడ్డి హామీ

● మద్య నిషేధం విషయంలో మీకు హామీ ఇచ్చిన మాట వాస్తవమే. కానీ రాష్ట్ర ఆర్థిక పరిస్థితి దృష్ట్యా ఇప్పటికిప్పుడు హామీ అమలుచేయడం కష్టం. అందుకే దశలవారీగా మద్య నిషేధాన్ని అమలుచేస్తా. ఏటా 25 శాతం షాపులను తగ్గించుకొని.. 2024 నాటికి సంపూర్ణ మద్య నిషేధం దిశగా అడుగులేస్తా. నేను ఇచ్చిన మాటను తప్పను. కచ్చితంగా నా హామీని అమలుచేస్తా. నన్ను నమ్మండి. మద్య నిషేధం అమలు చేశాకే ఓట్లు అడుగుతా..

-ఇదీ అధికారంలోకి వచ్చిన తర్వాత మద్య నిషేధంపై సీఎం జగన్ ప్రకటన

క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే..

సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి నవరత్నాల్లో పొందుపరిచిన మద్యనిషేధం హామీ అమలుకాలేదు. వైసీపీ ఐదేళ్ల పాలనలో ఎన్నడూ లేని విధంగా రూ.కోట్లలో మద్యం విక్రయాలు సాగాయి. నూతన విధానంలో భాగంగా ప్రభుత్వమే మద్యం విక్రయాలు చేపట్టి.. మందుబాబులతో తాగించింది. కొత్త బ్రాండ్ల పేరిట నాసిరకం మద్యం విక్రయించి.. మందుబాబులను ఊగిస్తోంది. వారి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తోంది. గతం కన్నా విపరీతంగా ధరలు పెంచేసి.. మొత్తం మందుబాబుల సొమ్మంతా ఊడ్చేస్తోంది. వారి కుటుంబాలను రోడ్డున పడేస్తోంది.

చాలా అన్యాయం..



మద్య నిషేధం విషయంలో సీఎం జగన్ మహిళలను దారుణంగా వంచించారు. పాదయాత్ర చేసినప్పుడు, గత ఎన్నికల ప్రచారంలో మొసలి కన్నీరుకార్చారు. పచ్చని కుటుంబాల్లో చిచ్చురేపుతున్న మద్యాన్ని నిషేధిస్తామని మాట ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక మాట మార్చారు. నాసిరకం మద్యంతో చాలామంది ప్రాణాలను తీశారు. ధరలు పెంచి సామాన్య కుటుంబాల్లో ఆర్థిక భారం పెంచారు.

-నడుకుదిటి రజిని, సర్పంచ్, బంటుపల్లి

బుద్ధి చెబుతారు..



జగన్ సంపూర్ణ మద్య నిషేధం చేస్తారని నమ్మాం. కానీ హామీ ఇచ్చి ఆయన మోసం చేశారు. మహిళలే కదా..అన్ని మరిచిపోతారని భావిస్తున్నారు. కానీ జరిగిన అన్యాయం మహిళలందరికీ తెలుసు. ఈ ఎన్నికల్లో వైసీపీకి తప్పకుండా ఓటుతో బుద్ధి చెబుతారు.

-ముప్పిడి సుజాత, రాష్ట్ర తెలుగు మహిళ కార్యదర్శి

జేఈఈ మెయిన్స్‌లో సిక్కోలు సత్తా

8వ ర్యాంకు సాధించిన సతీష్



జలుమూరు, ఏప్రిల్ 25: జేఈఈ మెయిన్స్ ఫలితాల్లో సిక్కోలు కుర్రోడు సత్తా చాటాడు. జలుమూరు మండలం కరవంజ గ్రామానికి చెందిన చింతు సతీష్‌కుమార్.. జాతీయస్థాయిలో 8వ ర్యాంకు సాధించాడు. ఓబీసీలో రెండో ర్యాంకు పొందాడు. సతీష్ తల్లిదండ్రులు చింతు బుచ్చెన్న, రమాదేవి ఇద్దరూ ఉపాధ్యాయులే. వీరు ప్రస్తుతం పాలకొండలో నివాసం ఉంటున్నారు. సతీష్ పదోతరగతి వరకూ పాలకొండలోనే చదివాడు. వైజాగ్‌లోని ప్రైవేటు కళాశాలలో ఇంటర్ పూర్తిచేశాడు. జేఈఈ మెయిన్స్‌లో 8వ ర్యాంకు సాధించడంతో తల్లిదండ్రులతోపాటు గ్రామస్థులు సతీష్‌ను అభినందించారు. సాఫ్ట్‌వేర్ ఇంజనీరు కావడమే తన లక్ష్యమని సతీష్ కుమార్ తెలిపారు.

సాహితికి 508వ ర్యాంకు



నగిరికటకం గ్రామానికి చెందిన భేరి సాహితి జేఈఈ మెయిన్స్ జాతీయస్థాయిలో 508వ ర్యాంకు, ఓబీసీ విభాగంలో 84వ ర్యాంకు సాధించింది. 10వ తరగతి వరకు గరివిడిలోని ప్రైవేటు స్కూలు, ఇంటర్ విశాఖలోని ఓ ప్రైవేటు కళాశాలలో చదివింది. తండ్రి వెంకటరావు విజయవాడ అగ్నిమాపక కేంద్రంలో హెచ్‌సీగా, తల్లి అరుణ ప్రైవేటు పాఠశాల టీచర్‌గా పనిచేస్తున్నారు. వీరంతా ప్రస్తుతం విజయవాడలో నివాసం ఉంటున్నారు.

తనూజ్‌కు 815వ ర్యాంకు

గుజరాతీపేట: శ్రీకాకుళం పట్టణానికి చెందిన శిల్లా తనూజ్ 815వ ర్యాంకు సాధించాడు. పట్టణంలోని కోమటివీధికి చెందిన తనూజ్ తండ్రి ఎస్.రవికుమార్ మెడికల్ షాపు నిర్వహిస్తున్నారు. తనూజ్ ఓ ప్రైవేటు కళాశాలలో ఇంటర్ చదువుతూ.. జేఈఈ మెయిన్స్‌కు కోచింగ్ తీసుకున్నాడు. అలాగే జిల్లాకు చెందిన మరికొందరు విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించారు. ఎం.మణికంఠ పృధ్వీరాజ్ 92, అల్లు రామలింగం నాయుడు 657 ర్యాంకులతో ప్రతిభ కనబరిచారు.

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- శ్రీకాకుళం పార్లమెంట్‌కు 33
- 8 అసెంబ్లీ నియోజకవర్గాలకు 175 పత్రాలు
- నేటి నుంచి పరిశీలన



ప్రచారంలో మేకపిల్లతో టీడీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు రామ్మోహన్‌నాయుడు, శంకర్

శ్రీకాకుళం,ఆంధ్రజ్యోతి/ శ్రీకాకుళం అర్బన్/ రణస్థలం, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తొలిఘట్టమైన నామినేషన్ల పర్వం గురువారంతో ముగిసింది. జిల్లాలో శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి, ఎనిమిది అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి ఈనెల 18 నుంచి నామినేషన్లు స్వీకరించారు. శ్రీకాకుళం పార్లమెంట్ నియోజకవర్గానికి 33 మంది నామినేషన్లు వచ్చాయి. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి 175 నామినేషన్లు పడ్డాయి. మొత్తంగా 208 నామినేషన్లు దాఖలయ్యాయి. ప్రధాన పార్టీల అభ్యర్థులందరూ రెండు లేదా మూడు సెట్లను సమర్పించారు. అసెంబ్లీ నియోజకవర్గాలకు సంబంధించి.. శ్రీకాకుళంలో 25, ఎచ్చెర్లలో 20, ఇచ్ఛాపురంలో 13, నరసన్నపేటలో 20, పలాసలో 25, పాతపట్నంలో 24, టెక్కలిలో 17, ఆమదాలవలసలో 31 నామినేషన్లు దాఖలయ్యాయి. అత్యధికంగా ఆమదాలవలస అసెంబ్లీ స్థానానికి.. అత్యల్పంగా ఇచ్ఛాపురం నియోజకవర్గానికి నామినేషన్లు వేశారు.

● శుక్రవారం నుంచి నామినేషన్ పత్రాలను అధికారులు పరిశీలించనున్నారు. సాంకేతిక పరంగా ఉన్న ఇబ్బందులు.. పత్రాల సమర్పణలో ఉన్న లోపాలను అధికారులు పరిశీలించి అన్నీ సరిగ్గా ఉన్నవాటిని ఆమోదిస్తారు. పత్రాలు సరిపోలనివి తిరస్కరిస్తారు. నామినేషన్‌ను ఉపసంహరించుకునేందుకు ఈనెల 29వరకు గడువు ఉంది. మే 13న పోలింగ్ జరగనుండగా.. జూన్ 4న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నారు.

సందడే సందడి

నామినేషన్లకు చివరిరోజు కావడంతో గురువారం సందడి నెలకొంది. శ్రీకాకుళం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొండు శంకర్.. ఎంపీ అభ్యర్థి కింజరాపు రామ్మోహన్‌నాయుడు ఆధ్వర్యంలో సుమారు 30 వేలమంది పార్టీ శ్రేణులతో భారీ ర్యాలీ నిర్వహించారు. అభ్యర్థులపై కార్యకర్తలు పూలవర్షాన్ని కురిపించారు. కొంతమంది సైకిల్‌ను, చేపలను, మరికొంతమంది మేక పిల్లలను బహుకరించారు. ఏడురోడ్ల కూడలి నుంచి జిల్లాపరిషత్ మీదుగా కలెక్టరేట్‌కు చేరుకుని.. ఆర్వోకు నామినేషన్ పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో శ్రీకాకుళం మాజీ ఎంపీపీ జగపతి, టీడీపీ నగర అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, జనసేన నాయకుడు దానేటి శ్రీధర్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు. అలాగే రణస్థలంలో కూటమి అభ్యర్థిగా బీజేపీ తరుపున నడుకుదుటి ఈశ్వరరావు గురువారం నామినేషన్ దాఖలు చేశారు. బీజేపీ, టీడీపీ, జనసేన పార్టీ శ్రేణులు సుమారు 40వేల మంది పాల్గొని.. ర్యాలీగా తరలివెళ్లారు. కోష్ట నుంచి సుభద్రాపురం జంక్షన్ వరకు అభిమాన సంద్రం కనిపించింది. కార్యక్రమంలో విజయనగరం టీడీపీ ఎంపీ అభ్యర్థి కలిశెట్టి అప్పలనాయుడు, కూటమి నాయకులు ముప్పిడి సురేష్, కిమిడి నాగార్జున, డీజీఎం ఆనందరావు, లంక శ్యామలరావు పాల్గొన్నారు.



శ్రీకాకుళంలో నామినేషన్‌కు ర్యాలీగా వెళ్తున్న టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు



రణస్థలంలో ఎన్ఈఆర్ నామినేషన్‌కు తరలివచ్చిన నేతలు, కార్యకర్తలు



ర్యాలీలో ఎచ్చెర్ల కూటమి అభ్యర్థి ఎన్ఈఆర్, పక్కన ఎంపీ అభ్యర్థి కలిశెట్టి



ప్రభుత్వ స్థలంలో నిర్మించిన పునాదులు

ప్రభుత్వ స్థలం కబ్జా

- హెచ్చరిక బోర్డులు పీకేసి.. ఆక్రమణ

(వజ్రపుకొత్తూరు)

సార్వత్రిక ఎన్నికల విధుల్లో అధికారులంతా నిమగ్నమయ్యారు. ఇదే అదునుగా అక్రమార్కులు ప్రభుత్వ భూములపై కన్నేసి.. ఆక్రమిస్తున్నారు. అధికారులు హెచ్చరిక బోర్డులు పెట్టిన స్థలాలను సైతం ఆక్రమణకు యత్నించడం గమనార్హం. వజ్రపుకొత్తూరు మండలం రాజాం పంచాయతీ పరిధిలోని తుఫాన్ రక్షిత భవనానికి సమీపంలో ప్రభుత్వ స్థలాన్ని.. కొన్నాళ్ల కిందట కొంతమంది పెద్దల సహాయంతో స్థానికులు ఆక్రమణకు యత్నించారు. దీనిపై అధికారులకు ఫిర్యాదు అందడంతో.. వారు పరిశీలించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఎన్నికల విధుల్లో అధికారులు బిజీగా ఉండడంతో.. ఈ ప్రభుత్వ స్థలంలో హెచ్చరిక బోర్డులను ఆక్రమణదారులు పీకేశారు. ఇటీవల పునాదులు వేసేందుకు సిద్ధమయ్యారు. విషయం తెలుసుకున్న డిప్యూటీ తహసీల్దార్ వి.గిరిరాజు వీఆర్వోలను పంపించి పనులు నిలుపుదల చేయించారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. మిగిలిన చోట్ల ప్రభుత్వ స్థలాల ఆక్రమణను కూడా అధికారులు గుర్తించి.. అడ్డుకోవాలని మండలవాసులు కోరుతున్నారు.

పరిశీలకులకు ఫిర్యాదు చేయండి

- కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్

కలెక్టరేట్, ఏప్రిల్ 25: సార్వత్రిక ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు ప్రత్యేకంగా పరిశీలకులను భారత ఎన్నికల కమిషన్ నియమించిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మన్‌జీర్ జిలానీ సమూన్ తెలిపారు. ఎన్నికల్లో అభ్యర్థులు, పార్టీలు చేస్తున్న వ్యయానికి సంబంధించి ఏవైనా ఫిర్యాదులు ఉంటే పరిశీలకులకు నేరుగా ఫిర్యాదు చేయవచ్చని పేర్కొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించినా ఫిర్యాదు చేయాలని సూచించారు.

● శ్రీకాకుళం, ఆముదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ స్థానాలకు సంబంధించి అధికారి శేఖర్ విద్యార్థికి చెందిన ఫోన్‌నెంబరు 90329 23131కు, శ్రీకాకుళం పార్లమెంటు స్థానానికి సంబంధించి కెకె.శరవణకుమార్ ఫోన్: 8121646161కు, ఇచ్ఛాపురం, టెక్కలి, పలాస, పాతపట్నం నియోజకవర్గాల సాధారణ పరిశీలకులు సందీప్‌కుమార్(ఐఏఎస్) ఫోన్: 9032423131కు, ఇవే నియోజకవర్గాల్లో ఎన్నికల వ్యయానికి సంబంధించి నవీన్‌కుమార్ సోనీ (ఐఆర్ఎస్) ఫోన్ నెంబరు 9030096161కు, ఎచ్చెర్లకు సంబంధించి తలజ్ పర్వేజ్ ఇక్బాల్(ఐఏఎస్) నెంబరు 9030983131కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని తెలిపారు.

● శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్నపేట అసెంబ్లీ స్థానాలకు సంబంధించి ఎన్నికల ఖర్చుల ఫిర్యాదులను నవీన్‌కుమార్ సోనీ 9030096161కు ఫోన్ చేసి తెలపాలని కోరారు.

కంట్రోల్ రూమ్ పరిశీలన



కంట్రోల్‌రూమ్‌లో ఎన్నికల పరిశీలకులు..

కలెక్టరేట్, ఏప్రిల్ 25: నూతన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన కంట్రోల్ రూమ్‌ను ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి, పాతపట్నం శాసనసభ నియోజక వర్గాలకు సంబంధించిన ఎన్నికల పరిశీలకుడు సందీప్ కుమార్ గురువారం పరిశీలించారు. మీడియా సర్టిఫికేషన్ మోనటరింగ్, సి-విజిల్ టీమ్స్, మోడల్ కోడ్ ఆఫ్ కాండక్ట్, పోస్టల్ బ్యాలెట్, ఎలక్షన్ ఎక్స్‌పెండిచర్, ఎక్సైజ్ కంట్రోల్ రూమ్, పోలీసు కంట్రోల్ రూమ్‌లను పరిశీలించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి టి.వేంకటేశ్వరరావు, నోడల్ అధికారులు కె.చెన్నకేశవరావు, ఎం.గణపతిరావు, ఆర్.శ్రీనివాసరావు, కిరణ్‌కుమార్, లక్ష్మీప్రసన్న, వాసుదేవరావు, ప్రసాదరావు, చిట్టిరాజు, సుబ్బారావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు దరఖాస్తులు

గుజరాతీపేట, ఏప్రిల్ 25: పదోతరగతి అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షలకు ఈ నెల 30 వరకు దరఖాస్తులు స్వీకరించనున్నట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 'ఒకటి నుంచి మూడు సబ్జెక్టులకు రూ.110, నాలుగు నుంచి ఆరు సబ్జెక్టు లకు రూ.125 పరీక్ష ఫీజు ఆయా హెచ్ఎంలు ధ్రువీకరించిన వెబ్‌సైట్ ద్వారా స్కూల్ లాగిన్‌లో మాత్రమే చెల్లించాలి. సీఎఫ్ఎంఎస్, బ్యాంకు చలానాల ద్వారా ఫీజు తీసుకోబడదు. పరీక్షలు మే 24 నుంచి జూన్ 3 వరకు.. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు నిర్వహిస్తామ'ని డీఈవో తెలిపారు.

ఆంధ్రజ్యోతి
శ్రీకాకుళం జిల్లా వార్తలు
జన కేతనం
శుక్రవారం 26 ఏప్రిల్ 2024

ధరల స్థిరీకరణ ఏదీ?

(నరసన్నపేట)

'అధికారంలోకి వచ్చిన వెంటనే రూ. 5 వేల కోట్లతో ధరల స్థిరీకరణ నిధి ఏర్పాటు చేస్తాం. ప్రభుత్వమే మద్దతు ధరకు పంట ఉత్పత్తులు కొనుగోలు చేస్తుంది. దళారుల ప్రమేయం ఉండదు. వ్యాపారుల కృత్రిమ కొరత ఉండదు. రైతులు, వినియోగదారులకు ఇది ఎంతో ఉపయుక్తంగా ఉంటుంది.' అని గత ఎన్నికల సమయంలో ప్రతిపక్ష నాయకుని హోదాలో సీఎం జగన్ ప్రకటించారు. అయితే పాలనా పగ్గాలు చేపట్టి ఐదేళ్లు గడిచినా.. ఇంతవరకు ఆ దిశగా ప్రయత్నాల్లేవు. దీంతో రోజురోజుకూ నిత్యావసర సరుకుల ధరలు ఆకాశాన్ని అంటుతున్నాయి.

- ఆకాశాన్ని తాకిన నిత్యావసరాలు
- మండుతున్న బియ్యం ధరలు
- పప్పులు, కూరగాయల రేట్లు కూడా..
- కళ్లెం వేయని వైసీపీ ప్రభుత్వం
- అల్లాడుతున్న పేద, మధ్యతరగతి కుటుంబాలు





ఈ ఫొటోలో ఉన్న వ్యక్తి పోలాకి గ్రామానికి చెందిన గడ్డెయ్య. ఓ విద్యాసంస్థలో కంప్యూటర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. గతంలో నెలకు రూ.10వేలు ఆదాయం వస్తే ఇంటిల్లిపాది గడిచేది. ప్రస్తుతం జీతం రూ.13వేలు అయినా కుటుంబాన్ని పోషించేందుకు చాలడం లేదు. నిత్యావసరాల ధరలతో పాటు పెట్రోలు, గ్యాస్, విద్యుత్ చార్జీలు పెరగడంతో ఇళ్లు గడవడమే కష్టంగా మారిందని గడ్డెయ్య వాపోతున్నాడు. ప్రభుత్వం నిత్యావసర వస్తువుల ధరలకు కళ్లెం వేస్తే.. తనలాంటి సామాన్య, మధ్యతరగతి కుటుంబాలు కడుపు నిండా బువ్వ తినవచ్చునని గడ్డెయ్య చెబుతున్నాడు.

మింగుడుపడని మెతుకులు

బహిరంగ మార్కెట్‌లో బియ్యం ధరలకు రెక్కలొచ్చాయి. నాణ్యమైన బియ్యం కిలో రూ. 60 నుంచి రూ.70 చెల్లిస్తే గాని దొరికే పరిస్థితి లేదు. ఐదేళ్లుగా బియ్యం ధరలు పెరుగుతున్నా కళ్లెం వేయడంలో ప్రభుత్వం వైఫల్యం చెందింది. దీంతో పేదలు అటు రేషన్ బియ్యం పొందలేక, ఇటు మార్కెట్‌లో కొనుక్కోలేక అన్నమో... రామచంద్రా! అంటూ అర్ధాకలితో అలమటిస్తున్నారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో బియ్యం (సామాన్య రకం) కిలో రూ.25 ఉండేది. అప్పట్లో రైతుల నుంచి సామాన్య రకం ధాన్యం క్వింటా రూ.1680కు కొనుగోలు చేసేవారు. ప్రస్తుతం బియ్యం (సామాన్య రకం) కిలో రూ.45 ఉండగా, రైతుల నుంచి ధాన్యం క్వింటా రూ.2,100కు కొనుగోలు చేస్తున్నారు. రైతుల నుంచి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేసినా బయట మార్కెట్‌లో బియ్యం ధరలు 80శాతం మేరకు పెరిగాయి. ఇక సన్న బియ్యం అయితే ఐదేళ్ల కిందట రూ. 40 ఉండగా ప్రస్తుతం రూ. కిలో 60కు చేరింది. 26 కిలోల సోనా మసూరీ బియ్యం బస్తా ధర రూ.1100 నుంచి ఏకంగా రూ. 1600కు పెరిగింది.

ఉడకని పప్పులు..

పప్పుల ధరలు ప్రస్తుతం మార్కెట్లో మోతెక్కిస్తోన్నాయి. ఐదేళ్ల కిందట రూ.120 ఉన్న కిలో కందిపప్పు ఇప్పుడు రూ.180కు చేరింది. ఇది మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని వ్యాపార వర్గాలు అంచనా వేస్తున్నాయి. మినపప్పు గతంలో కిలో రూ.90కు లభ్యమయ్యేది. ఇప్పుడది మార్కెట్‌లో రూ.160 పలుకుతోంది. రైతుల నుంచి వ్యాపారులు మినుములను కిలో రూ.67 కొనుగోలు చేస్తున్నా.. పప్పు ధరలు మాత్రం కిలో రూ.180కు చేరింది. ఇక సామాన్యులకు ఎప్పుడూ అందుబాటులో ఉండేది శనగపప్పు ధరలు కూడా ప్రస్తుతం అమాంతం పెరిగాయి. కిలో శనగపప్పు గతంలో రూ.65కు విక్రయించేవారు. ప్రస్తుతం రూ.120కు చేరింది.

కాగుతున్న నూనెలు..

వంట నూనెల ధరలు సలసల కాగుతున్నాయి. మార్కెట్‌లో అత్యధికంగా వినియోగించే పామాయిల్ ధర భగ్గుమంటోంది. ఆయిల్ ప్యాకెట్ రూ.100కు చేరింది. గతంలో అదే నూనె మార్కెట్‌లో రూ.80కు లభ్యమయ్యేది. దీని ప్రభావం ఇతర వంట నూనెలపైనా పడింది. సన్ ఫ్లవర్ ప్యాకెట్ రూ.100 నుంచి రూ.120కు, వేరుశెనగ రూ.190 నుంచి రూ.240కు చేరింది. నువ్వుల నూనె కిలో రూ.400 వరకు పలుకుతుండడంతో సామాన్యులు బెంబేలెత్తిపోతున్నారు.

ధరలను నియంత్రించాలి..



పెరుగుతున్న నిత్యావసర వస్తువుల ధరలను ప్రభుత్వమే నియంత్రించాలి. సామాన్యులకు అందనంత ఎత్తుకు నిత్యావసరాల ధరలు పెరగుతున్నాయి. ధరల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి.

-బమ్మిడి పద్మావతి, గృహిణి, నరసన్నపేట

ప్రభుత్వం విఫలమైంది..



నిత్యావసరాల ధరలను నియంత్రించడంలో ప్రభుత్వం విఫలమైంది అందుకు ధరలు పెరుగుదలే నిదర్శనం. పేద, మధ్యతరగతి కుటుంబాలకు బియ్యంతో పాటు పంచదార, కందిపప్పు, శనగలను ప్రభుత్వమే రేషన్ డిపోల ద్వారా పంపిణీ చేయాలి

-జల్లు చంద్రమౌళి, ఉర్లాం

కూరగాయలదీ అదే దారి..

పప్పు దినుసుల ధరలతో కూరగాయల ధరలు పోటీపడుతున్నాయి. ప్రస్తుతం మార్కెట్‌లో బీర కాయలు కిలో రూ.40, వంకాయిలు రూ.60, దొండకాయలు రూ.30, క్యారెట్ రూ.50, టామాటో రూ.30, బంగాళదుంప రూ.30, ఆకుపచ్చ బటానీలు రూ.70, క్యాప్సికమ్ రూ.80, పచ్చిమిర్చి రూ.50, అల్లం రూ.80, వెల్లుల్లి రూ.200, పిక్కతీసిన చింతపండు రూ.170, ఎండుమిర్చి రూ.220 పలుకుతున్నాయి. బెల్లం, ఆవాలు, జీలకర్ర, చిలగడదుంప, గుమ్మడికాయ, తదితర ధరలు వేడెక్కాయి.

కొండెక్కిన కోడి..

కోడి ధరలు కొండెక్కాయి. గతేడాది ఇదే సీజన్‌లో చికెన్ కిలో రూ.150 ఉండగా ఈ ఏడాది రూ.220కు చేరింది. స్కిన్‌లెస్ రూ.250 పలుకుతోంది. చేపలు ధరలు కూడా ఇలాగే ఉన్నాయి. కిలో రూ.200కు విక్రయిస్తున్నారు. సముద్రపు చేపలు మార్కెట్‌లోకి తక్కువగా రావడంతో చెరువు చేపలకు గిరాకీ ఏర్పడింది. గతంలో బంగారుపాప రకం కిలో రూ.140 ఉండగా ప్రస్తుతం రూ.200కు చేరింది. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బియ్యం ధరల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు.

సిరా గుర్తు 72 గంటలపాటు చెరిగిపోదు



మీకు ? తెలుసా

గార: ఎన్నికల్లో ఓటు వేసిన తర్వాత పోలింగ్ కేంద్రంలో ఓటరు చూపుడు వేలిపై సిరా చుక్కను గుర్తుగా పెడతారు. దీంతో సదరు ఓటరు మళ్లీ ఓటు వేయడానికి వీలుండదు. దొంగ ఓట్ల కట్టడికి ఎన్నికల కమిషన్ ఈ నిబంధన తొలినాళ్లలోనే రూపొందించింది. ఈ సిరాగుర్తు 72 గంటల పాటు చెరిగిపోకుండా ఉంటుంది. మైసూరుకు చెందిన మైసూరు పెయింట్స్ అండ్ వార్నీష్ పరిశ్రమ తయారుచేసిన ఇంకును ఈసీ 1962 నుంచి ఉపయోగిస్తోంది. ఈ సిరాలో 7.25 శాతం సిల్వర్, నైట్రేట్ కలపడం వల్ల అంత తొందరగా చెరిగిపోదని నిపుణులు చెబుతున్నారు.

టెండర్ ఓటంటే..

మీకు ? తెలుసా



పలాస: ఓ వ్యక్తి తన ఓటును మరో వ్యక్తి వినియోగించుకున్నారని ఫిర్యాదు చేస్తే.. ఆ ఓటరు కోసం ఎన్నికల సంఘం టెండరు ఓటు సౌకర్యం కల్పిస్తుంది. దీని ద్వారా ఆ వ్యక్తి ఓటు వేయవచ్చు. ఎన్నికల సంఘం నిబంధనలోని సెక్షన్ 42 ప్రకారం టెండర్ ఓటు ఏర్పాటు చేశారు. దీనికోసం ప్రిసైడింగ్ అధికారులకు ముందస్తుగా మార్గదర్శకాలు అందజేస్తారు. దీంతో ఓటింగ్ సమయంలో వచ్చిన కిట్‌లో టెండరు ఓటు కూడా ఇస్తారు. ఓటింగ్ ముగిసిన తర్వాత ఎన్నికల అధికారులు కమిషనర్‌కు ఈ వివరాలు తెలియజేయాల్సి ఉంటుంది. ఓటరు తన ఓటు వేరేవారు వేశారని తెలిస్తే ప్రిసైడింగ్ అధికారికి ఫిర్యాదు చేయాలి. తర్వాత దీన్ని పరిశీలించి గుర్తింపును ధ్రువీక రిస్తారు. అనంతరం టెండరు ఓటుకు డిమాండ్ చేయాలి. అయితే ఈవీఎం ద్వారా ఓటు వేయడానికి అవకాశం లేదు. బ్యాలెట్ సహాయంతో ఇటువంటి ఓటు వేయడానికి అవకాశం కల్పించారు.

సర్పంచ్ నుంచి ఎంపీగా ఎన్నిక

జ్ఞాపకాలు



హనుమంతు అప్పయ్యదొర

పలాస: సర్పంచ్ నుంచి ఏకంగా లోక్‌సభ సభ్యుడిగా ఎన్నికై అనంతరం రెండుసార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన ఘనత హనుమంతు అప్పయ్యదొరకే దక్కుతుంది. వజ్రపుకొత్తూరు మండలం బెండి పంచాయతీ సర్పంచ్‌గా అప్పయ్యదొర 1961 నుంచి 1981 వరకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇప్పటికీ ఆ పంచాయతీ దొర వంశీయుల చేతిలోనే ఉంది. అనంతరం ఎన్టీ రామారావు టీడీపీ ఏర్పాటు చేసిన తర్వాత న్యాయవాది వృత్తిలో ఉన్న హనుమంతు అప్పయ్యదొర ఆ పార్టీలో చేరారు. 1984 నుంచి 1989 వరకు ఎంపీగా వ్యవహరించారు. అప్పటి వరకు శ్రీకాకుళం లోక్‌సభ స్థానం నుంచి వరుసగా ఎన్నికవుతూ వస్తున్న బొడ్డేపల్లి రాజగోపాలరావుకు అప్పయ్యదొర చెక్‌పెట్టారు. అనంతరం 1994 నుంచి 99 సంవత్సరం వరకు టెక్కలి ఎమ్మెల్యేగా టీడీపీ తరఫున గెలుపొందారు. తర్వాత రాజకీయ సమీకరణల నేపథ్యంలో 2004 నుంచి 2009 వరకు కాంగ్రెస్ పార్టీ నుంచి టెక్కలి నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా గెలుపొందారు. దీంతో పాటు ఆయన సమితి అధ్యక్షుడిగా, సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్‌గా, సబార్డినేట్ లెజిస్లేటివ్ కౌన్సిల్ చైర్మన్‌గా కూడా పదవులు అలంకరించారు. కుగ్రామం బెండిలో జన్మించిన ఆయన అంచెలంచెలుగా ఎదిగి ఎంపీ, ఎమ్మెల్యే పదవులు అలంకరించారు. పార్లమెంట్‌లో ముస్లిం లా బిల్లుపై సుదీర్ఘ ప్రసంగం చేసిన ఘనత అప్పయ్యదొరకే దక్కింది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ రూపకర్తగా గుర్తింపు పొందారు. దీంతో పాటు కాశీబుగ్గ, బెండి రైల్వే ఫ్లైఓవర్ ఆయన హయాంలోనే మంజూరయ్యింది. ఈ ఫ్లైఓవర్ పూర్తవగా, కాశీబుగ్గ ఫ్లైఓవర్ ఇంకా నిర్మాణంలోనే ఉంది. ప్రస్తుతం ఆయన కుటుంబ సభ్యులు కాశీబుగ్గ వివేకానంద్‌మార్గ్‌లో నివాసముంటున్నారు. 2014లో అప్పయ్యదొర మృతి చెందారు.

పోస్టల్ బ్యాలెట్ మరింత సరళీకృతం



- ఎన్నికల సిబ్బంది వినియోగించుకోవచ్చు
- సక్రమంగా లేకపోతే ఓటు తిరస్కరణే

(సరుబుజ్జిలి)

ఎన్నికల్లో ప్రతి ఓటూ ఎంతో కీలకం. దీనిదృష్ట్యా పోలింగ్ విధుల్లో పాల్గొనే ఉద్యోగులు కూడా పూర్తిస్థాయిలో తమ ఓటు హక్కును వినియోగించుకోవడానికి ప్రత్యేకంగా పోస్టల్ బ్యాలెట్ సౌకర్యం కల్పించారు. విధుల్లో ఉండేవారిలో 50 శాతం మంది ఉద్యోగులు పోస్టల్ బ్యాలెట్ తీసుకుంటే, దాంట్లో కొందరు ఓటు వేసినా సకాలంలో పంపించడం లేదు. మరికొందరు పోస్టల్ ఓట్లు తప్పులతడకగా ఉండడంతో వాటిని పరిగణనలోకి తీసుకోరు. ఈ విషయంలో ఎన్నికల కమిషన్ ప్రతిష్టాత్మకంగా తీసుకొని మరింత సౌకర్యవంతంగా పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని సరళీకృతం చేసింది.


ఉపయోగించే ఫారాలు..

- **ఫారం-12:** పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు చేసే పత్రం.
- **ఫారం-13 (ఎ):** ఓటరు ధ్రువీకరణ పత్రం.
- **ఫారం-13 (బి):** కవరు లోపల పోస్టల్ బ్యాలెట్ పెట్టాల్సిన కవరు.
- **ఫారం-13(సి):** కవరు-బిపైన ఉండే కవరు, రిటర్నింగ్ అధికారికి తిరిగి పంపించాల్సిన కవరు.

ఉద్యోగి డిక్లరేషన్ సంతకం లేకపోతే..

డిక్లరేషన్‌లో బ్యాలెట్ పేపర్ సీరియర్ నెంబర్ రాయకపోవడం, గెజిటెడ్ అధికారి ధ్రువీకరణ లేకపోవడం, ఓటేసిన పోస్టల్ బ్యాలెట్‌ను 13బి కవరులో పెట్టకపోడం, సీటు వేయకపోవడం, పోస్టల్ బ్యాలెట్, డిక్లరేషన్‌లో ఒకే కవరులో పెట్టడం, బ్యాలెట్‌లో సంతకం చేయడం, ఓటు రహస్యతను కాపాడకపోవడం, ఏ అభ్యర్థికి చెందకుండా పైన లేదా మార్క్ చేయడం వంటి కారణాల వల్ల ఓటు తిరస్కరణకు గురవుతుంది.

- ఎన్నికల విధులు నిర్వహిస్తున్న అధికారులు, ఉద్యోగులకు ఉత్తర్వులతో పాటు ఫారం-12 అందజేస్తారు. ఫారం-12ను పూర్తిగా నింపి రిటర్నింగ్ అధికారికి ఎన్నికల మొదటి విడత శిక్షణ కార్యక్రమంలో ఏర్పాటు చేసే ఫెసిలిటేషన్ కేంద్రంలో అందించాలి. ఉద్యోగికి అదే ఆర్వో పరిధిలోని నియోజకవర్గంలోని ఓటు ఉన్నట్లయితే పోస్టల్‌బ్యాలెట్ నేరుగా లేదా రిజిస్టర్ పోస్టు ద్వారా అందజేస్తారు.
- ఉద్యోగి ఫారం-12తోపాటు ఎన్నికల విధులు ఉత్తర్వులు కాపీ, ఓటరు గుర్తింపు కార్డు, ఉద్యోగి గుర్తింపు కార్డు, జిరాక్స్ కాపీలు జతచేయాలి. ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆధ్వర్యంలో రెండోవిడత శిక్షణ సమయంలో ఫెసిలిటేషన్ సెంటర్ వద్ద అందరికీ అందుబాటులో ఉండే విధంగా పోస్టల్‌బ్యాలెట్ డ్రాప్‌బాక్స్ ఏర్పాటు చేస్తారు. పోస్టల్ బ్యాలెట్ పొందిన ఉద్యోగులంతా తమ ఓటు హక్కును వినియోగించుకుని ఫారం-13 కవర్ బీలో మార్క్ చేసిన పోస్టల్ బ్యాలెట్ పొందుపరిచి కవరుతో పాటు ధ్రువీకరణ పత్రం 13 ఏ గెజిటెడ్ అధికారి సర్టిఫై చేసి సంతకంతో కవర్‌బి (13సి) కవర్‌లో పొందుపరిచి డ్రాప్ బాక్సులో వేయాలి. లేదా ఆర్వో కార్యాలయంలో ఏర్పాటు చేసిన బాక్సులో వేయవచ్చు. లేదా ఆర్వోకు నిర్దిష్ట సమయంలో చేరే విధంగా పోస్టు ద్వారా పంపించవచ్చు. కవర్‌కు ఏ విధమైన పోస్టల్ స్టాంపులు అంటించాల్సిన అవసరం లేదు. పోలింగ్‌కు ఏడు రోజులు ముందు వరకు ఫారం12, సంబంధిత పత్రాలు అందించి ఆర్‌వో నుంచి పోస్టల్ బ్యాలెట్ పొందవచ్చు.



అధికారులే కీలకం

- వారి పర్యవేక్షణలోనే ఎన్నికల సమరం
- గ్రామస్థాయి నుంచి జిల్లా స్థాయి వరకు ప్రధాన పాత్ర

(హిరమండలం)

ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించడంలో అధికారులదే పాత్ర కీలకం. గ్రామ స్థాయి నుంచి మొదలుకుని జిల్లాస్థాయి వరకు అధికారులు తమ పాత్ర పోషిస్తారు. రాష్ట్రంలో ఎన్నికల నిర్వహణ, పర్యవేక్షణకు కేంద్ర ఎన్నికల సంఘం రాష్ట్ర ప్రభుత్వాన్ని, ప్రధాన ఎన్నికల అధికారి(చీఫ్ ఎలక్టోరల్ అధికారి)ని సంప్రదిస్తుంది. ఆ అధికారి పర్యవేక్షణలోనే ఎన్నికల ప్రక్రియ జరుగుతుంది. ఈ నేపథ్యంలో ఎన్నికల నిర్వహణలో జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో పనిచేసే అధికారుల వివరాలు..

జిల్లా ఎన్నికల అధికారి..

ప్రధాన ఎన్నికల అధికారి పర్యవేక్షణలో ప్రతి జిల్లా ఎన్నికల అధికారి ఉంటారు. పాలనాధికారే(కలెక్టర్) ఎన్నికల అధికారిగా వ్యవహరిస్తారు. జిల్లా వ్యాప్తంగా ఎన్నికల నియమావళి అమలు చేయడంలో కలెక్టర్ ప్రధాన పాత్ర పోషిస్తారు. ఉన్నతాధికారుల ఆదేశాలను అమలుచేస్తారు.

రిటర్నింగ్ అధికారి (ఆర్వో)


ఎన్నికల నిర్వహణకు కేంద్రం రిటర్నింగ్ అధికారిని నియమిస్తుంది. ఈ అధికారి సంబంధిత నియోజకవర్గాలను పర్యవేక్షిస్తారు. నామినేషన్ ప్రక్రియ, తుది జాబితా ప్రకటన, పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వహించడానికి సిబ్బంది నియామకం, వారికి అవసరమైన శిక్షణ ఇవ్వడం, ఓట్ల లెక్కింపు, ఫలితాల వెల్లడి వంటి అంశాలు ఆర్వో పర్యవేక్షణలోనే జరుగుతాయి. ఆర్డీవోకు ఈ బాధ్యతలను అప్పగిస్తారు.

సెక్టోరల్ అధికారి..

ఎనిమిది నుంచి పది పోలింగ్ కేంద్రాలను పర్యవేక్షించడానికి సెక్టోరల్ అధికారిని నియమిస్తారు. ఆయా బూత్‌ల్లో ప్రశాంతమైన వాతావరణం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటారు. అవసరమైతే పరిస్థితులకు అనుగుణంగా ఆయా చోట్ల 144 సెక్షన్ విధించే అధికారం ఆయనకే ఉంటుంది.

ఓటర్ల నమోదు అధికారి..

ఓటర్ల నమోదు అధికారి (ఈఆర్వో, ఏఈఆర్వో) ప్రతి నియోజకవర్గ స్థాయిలో ఉంటారు. కొత్తగా ఓటు నమోదు చేసుకునే వారు, జాబితాలో పేర్లు, ఫొటోలు తప్పుగా ఉన్న వారంతా ఆయన్ను సంప్రదించాలి. ఈఆర్వో, ఏఈఆర్వో పర్యవేక్షణలో సిబ్బంది ఓటర్ల జాబితాను తయారుచేస్తారు.



ప్రిసైడింగ్ అధికారి (పీవో)

ప్రతి పోలింగ్ కేంద్రానికి ప్రిసైడింగ్ అధికారి ఉంటారు. ఈవీ ఎంలు, వీవీ ప్యాట్‌లు బూత్‌లకు తీసుకొచ్చి ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించి తిరిగి వాటిని స్ట్రాంగ్‌రూముకు చేర్చేవరకు పీవోదే బాధ్యత. వీరితో పాటు సహాయ ప్రిసైడింగ్ అధికారులు ఉంటారు. పోలింగ్‌కేంద్రాల్లో అన్ని కార్యకలాపాలు పీవో పర్యవేక్షణలోనే జరగుతాయి.

సూక్ష్మ పరిశీలకులు..

ఎన్నికలు జరిగిన తీరు, పర్యవేక్షణపై నివేదిక రూపొందించి కేంద్ర ఎన్నికల సంఘానికి నివేదిక పంపించడానికి సూక్ష్మ పరిశీలకులను ఏర్పాటుచేస్తారు. ప్రతి మండలానికి ఒకరు మాత్రమే ఉంటారు. వీరంతా ఏర్పాట్లను క్షుణ్ణంగా పరిశీలిస్తారు.

బూత్ లెవల్ అధికారి (బీఎల్వో)

ప్రతి కేంద్రానికి బూత్ లెవల్ అధికారి ఉంటారు. కొత్తగా ఓటరు జాబితాలో చేరే వారికి ఫారం-6, తొలగింపునకు ఫారం-7, తప్పుల సవరణకు అవసరమైన ఫారాలు ఇవ్వడం, అర్హులైన వారంతా ఓటు నమోదు చేసుకునేలా చూడడం, పోలింగ్ కేంద్రాల్లో సౌకర్యాల కల్పనకు ప్రతిపాదించడం, ఓటర్ల జాబితా ప్రదర్శన, కేంద్రాల మార్పునకు బీఎల్వోలు పనిచేస్తుంటారు. వీరిలో వీఆర్ ఏలు, కారోబార్లు, అంగన్‌వాడీ టీచర్లు ఉంటారు.

పోలింగ్ ఏజెంట్లు

అభ్యర్థులు పోలింగ్ రోజున ప్రతి కేంద్రానికి వెళ్లి నేరుగా పరి శీలించలేరు. అందు వల్ల వారి తరఫున ఒక ఏజెంట్‌ను నియమించుకోవచ్చు. పోలింగ్ ఏజెంట్ ఆ కేంద్రంలో ఓటరుగా ఉండాలి. పోటీలో ఎంత మంది బరిలో ఉంటే అంత మంది ఏజెంట్లను నియమించుకోవడానికి అవకాశాలు ఉన్నాయి.

జన కేతనం
ఆంధ్రజ్యోతి
శుక్రవారం 26 ఏప్రిల్ 2024



నిలిచిన గంగసాగర్ రిజర్వాయర్ పనులు

● గంగసాగరాన్ని రిజర్వాయర్‌గా మారుస్తానని మాటిచ్చిన సీఎం ● అధికారం చేపట్టాక మరిచిపోయిన వైనం
● రైతులకు తప్పని సాగునీటి కష్టాలు ● వర్షం పడితేనే పంటలు.. లేదంటే బీడే..
● ఏటా ఇదే పరిస్థితి ● పట్టించుకోని వైసీపీ పాలకులు

జగనన్న హామీ గంగలోకి..

మాది రైతుల ప్రభుత్వమని, వారికి చేయూతనిస్తూ, సాగునీటి ప్రాజెక్టులు అభివృద్ధి చేస్తున్నామని వైసీపీ నాయకులు నిత్యం గొప్పలు చెబుతుంటారు. కానీ, వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా ఉంది. కంచిలి మండలంలోని గంగసాగరంతోపాటు మరికొన్ని ప్రాజెక్టుల పనులు నిలిచిపోవడమే దీనికి ఉదాహరణ. 2019 ఎన్నికల ముందు పాదయాత్రతోపాటు వివిధ సందర్భాల్లో అప్పటి ప్రతిపక్ష నాయకుడు జగన్ గంగసాగ రాన్ని రిజర్వాయర్‌గా మారుస్తామని హామీ ఇచ్చారు. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత మరిచిపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

(కంచిలి)

మండలంలోని మాణిక్యపురం ఎగువభాగంలో వర్షాకాలంలో వచ్చిన నీటిని నిల్వ చేయడానికి అవకాశం లేకపోవడంతో ఖరీఫ్‌లో సైతం సాగునీటికి అవస్థలు తప్పడం లేదు. ఈ ప్రాంతానికి ఆనుకుని ఉన్న 200 ఎకరాల్లో విస్తరించిన గంగసాగరంలో తుప్పలు, డొంకలు, షిల్ట్ పేరుకుపోవడంతో చుక్కనీరు ఉండడానికి వీల్లేకుండాపోయింది. దీంతో ఈ సాగ రం పరిధిలోని 1200 ఎకరాల ఆయకట్టులో ఒక్కసారి కూడా పంటలు పూర్తిస్థాయిలో పండలేదు. నియోజకవర్గంలోనే పెద్ద సాగరంగా గుర్తింపుపొందినా పాలకుల నిర్లక్ష్యంతో అభివృద్ధికి నోచుకోలేదు. గతంలో టీడీపీ హయాంలో కొంతమేర పనులు జరిగినా వివిధ కారణాలతో పూర్తికాలేదు. వైసీపీ ప్రభుత్వం వచ్చి ఐదేళ్లు గడిచినా రిజర్వాయర్ పనులను పట్టించుకోకపోవడంపై రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

టీడీపీ హయాంలో పనులు ప్రారంభం..

2007లో రిజర్వాయర్ ఏర్పాటుకు అప్పటి అధికారులు ప్రతిపాదనలు చేశారు. ఈ మేరకు భూసేకరణ కూడా చేశారు. రూ.3కోట్లతో పనులు కూడా ప్రారంభించారు. అయితే సాంకేతికకారణాలతో పనులు నిలిచిపోయాయి. 2019 ఫిబ్రవరి 15న అప్పటి ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ రూ.6.3 కోట్ల అంచనా వ్యయంతో రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. యుద్ధప్రాతిపదికన పనులు ప్రారంభించి సాగరం చుట్టూ రాతితో గట్టు కూడా ఏర్పాటు చేశారు. అయితే ఆ తర్వాత పనులకు నిధులు విడుదలకాకపోవడం, మాణిక్యపురం ముంపు సమస్య తలెత్తిన నేపథ్యంలో పనులు నిలిచిపోయాయి. ప్రస్తుతం పెరిగిన ధరల నేపథ్యంలో రిజర్వాయర్ పనులు పూర్తి చేయాలంటే మరో రూ.4కోట్లు అవసరమవుతాయని అధికారులు చెబుతున్నారు.

వృథాగా నీరు..

కంచిలి మండలంలోని గోకర్ణపురం, జలంత్రకోట, బూరగాం తదితర గ్రామాల్లోని ఆయకట్టుకు ఈ సాగరం నుంచే నీరందుతోంది. అయితే వర్షాకాలంలో చేరిన నీటిని నిల్వచేసే అవకాశం లేకపోవడంతో కొన్నిసార్లు ఖరీఫ్‌లో సైతం పంటలు పండడం లేదని రైతులు వాపోతున్నారు. ఈసాగరం నుంచి ముకుందసాగరం తర్వాత పైడిగాం చానల్‌లోకి చేరుతుంది. పైడిగాం చానల్ ద్వారా సోంపేట మండలంలోని పలు గ్రామాల్లో పంట పొలాలకు నీరందుతుంది. అయితే మినీ రిజర్వాయర్ పూర్తికాకపోవడంతో ముకుందసాగరం, పైడిగాం చానల్‌లో నిల్వచేసే అవకాశం లేక వర్షాకాలంలోనే నీరు వృథాగా పోతోంది. దీంతో గంగసాగరం పూర్తిచేస్తే కంచిలి, సోంపేట మండలాల అన్నదాతలకు మేలు జరుగుతుందని రైతుల సంఘాలు చెబుతున్నాయి.



మరమ్మతులకు నోచుకోని గోవిందసాగరం షట్టరు

ఏటా వర్షాధారంపైనే..

కంచిలి మండలంలోని ఆయకట్టుకు నీరందించే ఏ ఒక్క ప్రాజెక్టు గత ఏడు దశాబ్దాల్లో పూర్తిచేయలేదు. తూర్పుకనుమల్లో ఈ ప్రాంతం ఉండడం వర్షాకాలంలో ఇక్కడ సగటు కంటే ఎక్కువగానే వర్షపాతం నమోదవుతుంది. అయితే నీటిని ఒడిసిపెట్టేందుకు చిన్న చిన్న గొలుసుకట్టు చెరువుల తప్ప చెప్పుకోదగ్గ ప్రాజెక్టు ఒక్కటీ లేదు. దీంతో ఖరీఫ్‌లో శివారు తడికి సైతం ఆకాశం వైపు అన్నదాతలు చూడాల్సివస్తోంది. దీనికితోడు గత దశాబ్దకాలంలో రుతుపవనాలు అనుకూలించకపోవడంతో సెప్టెంబరు వరకూ నాట్లు పడడంలేదు. ప్రీమాన్ పిరియడ్‌లో మే నెలలో వర్షాలు కురుస్తున్నా ఈ నీరంతా వృథాగాపోతోంది. ఆ నీటిని నిల్వచేసే అవకాశం ఉంటే ఖరీఫ్‌లో జూన్, జూలైలోనే నాట్లు పడే అవకాశం ఉంటుందని రైతులు వాపోతున్నారు. ఈనేపథ్యంలో గంగసాగరం రిజర్వాయర్‌గా రూపొందితే తమ సాగునీటి కష్టాలు తీరుతాయని ఆశించిన ఇక్కడ రైతుల ఆశలు తీరేలాలేవు. దీంతో ఈ సాగరం ఆయకట్టు రైతులంతా వర్షాధారంపైనే ఆధారపడాల్సి వస్తోంది. ఈ రిజర్వాయర్ నిర్మాణం పూర్తి చేసి సాగరం నుంచి ప్రధానంగా వెళ్తున్న కుడి, ఎడమ కాలువలను సైతం పూర్తిస్థాయిలో మరమ్మతులు చేపడితే సాగునీటి కష్టాలు తీరుతాయని రైతులు చెబుతున్నారు. ఈ విషయమై ఇరిగేషన్ శాఖ ఏఈఈ మధుసూదన పాణిగ్రాహి మాట్లాడుతూ.. గంగసాగరం పనులకు ప్రతిపాదనలు పంపించామని, నిధులు విడుదలైన వెంటనే పనులు ప్రారంభిస్తామని చెప్పారు.

గొలుసుకట్టు చెరువులపైనా నిర్లక్ష్యం

మండలంలోని గంగాసాగరంతో పాటు మిగిలిన జలాశయాలను కూడా వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని అన్నదాతలు ఆరోపిస్తున్నారు. ప్రధానంగా రాజుల కాలంలో నిర్మించిన గొలుసు కట్టు చెరువులు, సాగరాలను కనీస మరమ్మతులు, అభివృద్ధికి నోచుకోవడం లేదు. మండలంలో సుంకిలి, గోవింద, హనుమంతు తదితర సాగరాలు ఐదేళ్ల వైసీపీ కాలంలో అభివృద్ధికి నోచుకోకపోవడంతో వందల ఎకరాలకు నీరందడంలేదు. గొలుసుకట్టు చెరువుల నిర్వహణపై వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం చూపడంపై రైతులు ఆందోళన వ్యక్తంచేస్తున్నారు.

● ప్రధానంగా ముండలా గ్రామానికి సమీపంలో కొండల దిగువల ఉన్న సుంకిలి సాగరానికి 350 ఎకరాల ఆయకట్టు ఉంది. ఈ సాగరం నుంచి విడుదలయ్యే నీరు కొనకకొండల మీద నుంచి గోవింద సాగరం మీదుగా ఎంఎస్‌పల్లి రాకాసిగడ్డ అక్కడి నుంచి కేసరిపడ మీదుగా ఇచ్ఛాపురంలోని దండు గడ్డలో కలుస్తుంది.

● డోలగోవిందపురం వద్ద ఉన్న గోవిందసాగరానికి 150ఎకరాల ఆయకట్టుఉంది. ముండలా గ్రామం నుంచి సుంకిలిసాగరం మీదుగా సాగుతుంది.

● భోగాబెణి కొండల నుంచి వచ్చే నీటిలో ఏర్పడిన హనుమంతు సాగరం గోవిందసాగరంలో కలిసి ఇచ్ఛాపురం మండలంలోని వైపు ఉన్న ఆయకట్టుకు సాగునీటిని అందిస్తుంది.

● శాసనాం వద్ద ఉన్న 244 ఎకరాలకు సాగునీరందించే లొద్దాలొద్ది రిజర్వాయర్‌తో పాటు పద్మనాభసాగరం, తాళ్లసాగరం తదితర సాగునీటి పథకాల మరమ్మతులకు వైసీపీ ప్రభుత్వం నిధులు విడుదలచేయకపోవడంతో కనీస మరమ్మతులకు కూడా నోచుకోవడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు.



నీరులేక మైదానాన్ని తలపిస్తున్న సుంకిలి సాగరం

చుక్కనీరు నిలవడం లేదు



గంగసాగరం రిజర్వాయర్ పనులు పూర్తిచేస్తే దిగువను ఉన్న రైతులకు ఎంతో మేలు జరుగుతుంది. ఏళ్ల తరబడి పనులు నిలిచిపోవడంతో సాగరంలో చుక్కనీరు నిలవడం లేదు. ఇప్పటికైనా పాలకులు స్పందించి రైతులను ఆదుకోవాలి.

-కీలుగు నూకరాజు, ఆయకట్టు రైతు, అర్జునాపురం

ఎదురుచూపులే మిగిలాయి



గంగసాగరం నుంచి సాగునీటికి ఏటా ఎదురుచూపులే మిలుతున్నాయి. ఏళ్లు గడుస్తున్నా నీరందేలా ఏ ఒక్కరూ చర్యలు తీసుకోవడం లేదు. నిధులు మంజూరయ్యాయని చెబుతున్నా, పనులు మాత్రం జరగడం లేదు. రైతుల బాధలు ఎవ్వరికీ పట్టడం లేదు.

-టి.బాలాజీ, గోకర్ణపురం

నలుగురు స్పీకర్లను అందించిన సిక్కోలు

● ఆంధ్ర రాష్ట్ర రెండో సభాపతిగా రొక్కం నరసింహం దొర
● ఉమ్మడి రాష్ట్రంలో ఎన్నికైన తంగి శ్యామలరావు, ప్రతిభాభారతి
● నవ్యాంధ్ర రెండో స్పీకర్‌గా తమ్మినేని సీతారాం



నరసింహందొర (ఫైల్)



సత్యనారాయణ (ఫైల్)



ప్రతిభాభారతి



సీతారాం

(రణస్థలం)

శ్రీకాకుళం జిల్లా రాజకీయ చైతన్యానికి పెట్టింది పేరు. ఉమ్మడి రాష్ట్రంలోనైనా, అవశేష ఆంధ్రప్రదేశ్‌లోనైనా రాజకీయాల్లో జిల్లాది చెరగని ముద్ర. ఎంతో మంది హేమాహేమీలను జాతికి అందించింది ఈ జిల్లా. సర్దార్ గౌతు లచ్చన్న విపక్ష నేతగా వ్యవహరించగా.. మజ్జి తులసీదాస్ ఉమ్మడి రాష్ట్రం పీసీసీ అధ్యక్షుడిగా వ్యవహరించారు. వచ్చేది ఏ ప్రభుత్వం అయినా.. కేబినెట్‌లో కీలక పోర్టు పోలియోలను ఈ జిల్లాయే దక్కించుకోవడం విశేషం. ఏకంగా శాసన సభాపతులుగా నలుగురు నేలు వ్యవహరించడం గమనార్హం. ఇప్పటివరకూ రాష్ట్ర శాసనసభ స్పీకర్లుగా జిల్లాకు చెందిన రొక్కం నరసింహందొర, తంగి సత్యనారాయణ, కావలి ప్రతిభాభారతి, తమ్మినేని సీతారాం పదవీ బాధ్యతలు చేపట్టారు. అయితే ఇందులో రొక్కం నరసింహందొర ఆంధ్ర రాష్ట్ర అసెంబ్లీ స్పీకర్‌గా, తమ్మినేని సీతారాం నవ్యాంధ్రప్రదేశ్ రెండో స్పీకర్‌గా ఎంపికయ్యారు. మిగతా ఇద్దరు ఉమ్మడి ఏపీ రాష్ట్ర శాసనసభ స్పీకర్లుగా ఎంపిక కావడం విశేషం.

● ఆంధ్ర రాష్ట్ర శాసనసభ రెండో స్పీకర్‌గా రొక్కం నరసింహందొర పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన తొలితరం కాంగ్రెస్ నాయకుడు. 1955లో టెక్కలి నుంచి కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీచేసి గెలుపొందారు. బెజవాడ గోపాలరెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో దాదాపు ఏడాదిన్నరపాటు స్పీకర్‌గా వ్యవహరించారు. 1955 ఏప్రిల్ 23 నుంచి 1956 డిసెంబరు 3 వరకూ ఆయన పదవిలో ఉన్నారు.

● ఏపీ శాసనసభ ఏడో స్పీకర్‌గా జిల్లాకు చెందిన తంగి సత్యనారాయణ ఎన్నికయ్యారు. 1983 జనవరి 18 నుంచి 1984 ఆగస్టు 28 వరకూ శాసనసభ స్పీకర్‌గా వ్యవహరించారు. ఎన్టీఆర్ నేతృత్వంలోని తెలుగుదేశం పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత ఆ ప్రభుత్వంలో తంగి సత్యనారాయణ స్పీకర్‌గా ఎన్నిక కావడం విశేషం. ఈయన శ్రీకాకుళం అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహించారు. 1967, 1983లో రెండుసార్లు ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. శాసనసభలో జరిగే చర్చలు ప్రజలకు యథాతథంగా చేరాలని, వార్తా పత్రికలు రాజకీయపరమైన, వ్యక్తిగత రాగద్వేషాలకు అతీతంగా వ్యవహరిస్తూ సభా కార్యక్రమాలను నిష్పక్షపాతంగా అందించాలని 1983 సెప్టెంబరు 19న రూలింగ్ ఇచ్చారు.

● ఏపీ శాసనసభ 11వ స్పీకర్‌గా జిల్లాకు చెందిన కావలి ప్రతిభాభారతి పదవీ బాధ్యతలు చేపట్టారు. ఏపీ అసెంబ్లీ చరిత్రలో ఈమె తొలి మహిళా స్పీకర్ రికార్డు సాధించారు. 1999 నవంబరు 11 నుంచి2004 మే 30 వరకూ ఆమె పదవిలో కొనసాగారు. ఆమె వరుసగా ఐదుసార్లు ఎమ్మెల్యేగా ఎచ్చెర్ల నుంచి ప్రాతినిధ్యం వహించారు. అంతకు ముందు ఎన్టీఆర్, చంద్రబాబు హయాంలో కీలక మంత్రిత్వ శాఖలను నిర్వర్తించారు. 1999లో చంద్రబాబు హయాంలో ఆమెకు స్పీకర్ పదవి వరించడం విశేషం. 2000 సెప్టెంబరు 13న వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై జరిగిన చర్చల సమయంలో ఉదయం 8.30 గంటల నుంచి రాత్రి 9.30 గంటల వరకూ..13 గంటల పాటు శాసనసభను నిర్వహించారు.

● నవ్యాంధ్రప్రదేశ్‌కు రెండో స్పీకర్‌గా తమ్మినేని సీతారాం 2019 మే 30న పదవీ బాధ్యతలు చేపట్టారు. ఈయన ఆమదాలవలస నుంచి ఎమ్మెల్యేగా ప్రాతినిధ్యం వహిస్తున్నారు. మంత్రి పదవిని ఆశించారు. కానీ ఈయనకు స్పీకర్ పదవికి ఎంపిక చేస్తూ సీఎం జగన్ నిర్ణయం తీసుకున్నారు. ఈయన అధ్యక్షతన ప్రస్తుతం చివరి అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నాయి. టీడీపీతో రాజకీయ అరంగేట్రం చేసిన తమ్మినేని సుదీర్ఘ కాలం ఆ పార్టీలో కొనసాగారు. కానీ మారిన రాజకీయ పరిస్థితుల నేపథ్యంలో వైసీపీలో చేరారు.

చాలా పెద్ద బాధ్యత

సభాపతి అన్నది చాలా పెద్ద బాధ్యత. అసెంబ్లీని నడపడమంటే అంత ఆషామాషీ విషయం కాదు. నాడు స్పీకర్‌గా నన్ను ఎంపిక చేసినప్పుడు చాలా భయం వేసింది. 294 ఎమ్మెల్యేలు ఉన్న హౌస్‌ను నేను నడపగలనా? అని అనుమానపడ్డాను. అప్పటికే అసెంబ్లీలో హేమాహేమీలు ఉన్నారు. రాజకీయాల్లో కాకలుతీరిన నాయకులు ఉన్నారు. దీంతో ఎటువంటి పరిస్థితులు ఎదురవుతాయా? అని భయపడ్డాను. కానీ అప్పటి సీఎం చంద్రబాబు ఎంతో ధైర్యం చెప్పారు. మనో ధైర్యాన్ని ఇచ్చారు. మీరు చేయగలరు అని ప్రోత్సహించారు. వెనుకబడిన ప్రాంతాల అభివృద్ధిపై జరిగిన చర్చ సందర్భంగా 13 గంటల పాటు శాసనసభను నడపడం నా జీవితంలో మరిచిపోలేనిది. స్పీకర్‌గా నాకు పదవీకాలం ఎంతో సంతృప్తినిచ్చింది.

-కావలి ప్రతిభాభారతి, మాజీ స్పీకర్



వెలవెలబోయిన తమ్మినేని ప్రచారం

బూర్జ: మండలంలోని కొల్లివలస గ్రామంలో ఆమదాలవలస వైసీపీ అసెంబ్లీ అభ్యర్థి తమ్మినేని సీతారాం గురువారం నిర్వహించిన ఎన్నికల ప్రచారం జనాలు లేక వెలవెలబోయింది. ప్రచారానికి వివిధ హోదాల్లో ఉండే వారిని, పార్టీ శ్రేణులను ఆయన ఆహ్వానించారు. అయితే అనుకున్న స్థాయిలో నాయకులతో పాటు జనాలు రాకపోవడంతో స్పీకర్ నిరుత్సాహం చెందారు.

పాలకా.. మా కష్టాలు పట్టవా?

● భైరి సాగునీటి కాలువపై నిర్లక్ష్యం ● గట్లు బలహీనపడి.. షట్టర్లకు తుప్పు పట్టిన వైనం
● పిల్ల కాలువలదీ ఇదే పరిస్థితి ● గార మండల రైతుల ఆగ్రహం

వంశధార నది చెంతన ఉన్న గార మండల రైతన్నలకు దశాబ్దాలుగా సాగునీటి సమస్య వేధిస్తోంది. ఇక్కడ వేలాది ఎకరాలకు సాగునీరందించే అవకాశమున్నా సాగునీటి కాలువలు అభివృద్ధికి నోచుకోకపోవడం, గట్టు బలహీనపడడం, షట్టర్లు తుప్పుపట్టడంతో రైతులకు అగచాట్లు తప్పడంలేదు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కాలువల నిర్వహణపై నిర్లక్ష్యం చూపడంతో ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందని పరిస్థితి నెలకొంది. సాగునీటి కాలువల నిర్వహణకు అవసర మైన నిధులు ఖరీఫ్ సీజన్‌కు ముందు విడుదల చేకపోవడంతో అధికా రులు కూడా ఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో ఉన్నారు. పాలకులకు తమ కష్టాలు పట్టవా అంటూ రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



వమరవెల్లి రోడ్డు వద్ద పాడైన షట్టర్

(గార)

మండలంలో భైరి లింక్ కాలువ ద్వారా బూరవల్లి, గార, శాలిహుండాం, కొర్ని, కొర్లాం వమరవెల్లి, తోణంగి కళింగపట్నం తదితర గ్రామాల్లో 16 వేలఎకరాల ఆయకట్టుకు నీరందాల్సి ఉంది. అయితే దశా బ్దాలుగా ఈ కాలువతోపాటు మిగిలిన పిల్లకాలువల్లో పూర్తిస్థాయిలో పూడిక, పిచ్చిమొక్కలు తొలగించక పోవడంతోపాటు గట్లు చాలాచోట్ల బలహీన పడినా పటిష్టపరచేలేదు. గట్లు బలహీనంగా ఉండడంతో ఏటా వర్షాకాలంలో కాలువలోకి నీరు చేరే సమయంలో కొట్టుకుపోవడంతో నీరు పొలాలను ముంచెత్తి ముంపనకు గురవుతున్నాయి. ఫలితంగా దిగువ ప్రాంతాల్లోని గ్రామాల్లో గల ఆయకట్టుకు పూర్తిస్థాయిలో నీరందక పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. బూరవెల్లి, అంబల్లవలస, తంగుళ్లపేట, వమరవెల్లి, కళింగపట్నం, తదితర చోట్ల దశాబ్దాల కిందట వేసిన షట్టరు తుప్పు పట్టిపోయి విరిగిపోవడంతో కాలువల్లో నీరు పొలాలకు వెళ్లకుండా వృథాగా కిందకు పోతోంది. షట్టర్ల దుస్థితిని అధికారులు దృష్టికి తీసుకువెళ్లినా నిధులు లేకపోవడంతో మరమ్మతులకు నోచుకోలేదు. ఖరీఫ్ సీజన్‌కు ముందు ఏటా కాలువలను మరమ్మతు చేసి సిద్ధం చేసే వారు. ప్రస్తుతం వేతనదారులతో అక్కడక్కడ కొన్ని కాలువల్లో పూడిక తొలగించి చేతులు దులుపుకుంటున్నా, పూర్తిస్థాయిలో మరమ్మతులు చేయడం లేదు. భైరి లింక్ కాలువ కాలువతో పాటు పదేళ్ల కిందట ఏర్పాటు చేసిన వంశధార కాలువ ద్వారా కూడా వత్సవ లస, ఎర్రగుడ్డి, జల్లపేట తదితర గ్రామాల్లోని శివారు ప్రాంతాల్లో భూములకు పూర్తి స్థాయిలో నీరందక అక్కడ పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడుతోంది. కాలువల్లో పూడిక తొలగించకపోవడంతో పలు గ్రామాల్లో రైతులు వ్యవసాయ మోటార్లు ఆధారంగా పంటలను సాగు చేస్తున్నారు. నారాయణపురం కాలువ ద్వారా వాడాడ, శ్రీకూర్మం, దీపావళి, సిమ్మపేట తదితర గ్రామాల్లో వేలాది ఎకరాలకు పూర్తి స్థాయిలో నీరందడం లేదు. సాగునీటి సమస్య పరిష్కరించి తమ పంటలను కాపాడాలని మంత్రి ధర్మాన ప్రసాదరావు, అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకోవడం లేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.



తోణంగి వద్ద పిచ్చిమొక్కలతో నిండిపోయిన కాలువ

ఆటోబోల్తా: డ్రైవర్ మృతి

ఎచ్చెర్ల: చిలకపాలెం సమీపంలో హైవేపై గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆటో డ్రైవర్ మజ్జి అచ్చెప్పడు (48) గాయపడి మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి.. పొందూరు మండలం లోలుగు గ్రామానికి చెందిన అచ్చెప్పడు ప్రతిరోజు శ్రీకాకుళం నుంచి కూరగాయలు తీసుకుని రణస్థలానికి వెళుతుంటాడు. గురువారం కూడా అలాగే వెళుతుండగా వెనుక నుంచి వ్యాన్ ఢీకొనడంతో ఆటో అదుపు తప్పి బోల్తా పడింది. వెంటనే క్షతగాత్రుడిని శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఎస్సై చిరంజీవి ఘటనా స్థలానికి చేరుకుని పోస్టుమార్టం చేయించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

500 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన లింగాలవలస గ్రామస్థులు

టెక్కలి/సంతబొమ్మాళి: టెక్కలి నియోజకవర్గంలో ఒకే రోజు 500 కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. గురువారం వైసీపీ అభ్యర్థి దువ్వాడ శ్రీనివాస్ బంధువులైన టెక్కలి మండలం లింగాల వలస గ్రామానికి చెందిన సంపతిరావు రవీంద్రనాథ్ 300 కుటుంబాలతో టీడీపీలో చేరారు. వీరికి కోటబొమ్మాళిలోని పార్టీ కార్యా లయంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు కండువాలు వేసి ఆహ్వానించారు. నందిగాం మండలం బాణాపురానికి చెందిన న్యాయవాది కర్రి శేషు తన అను చరులతో, నౌపడాకు చెందిన జర్నలిస్ట్ కోట రాము, సంతబొమ్మాళి మండలం వైసీపీ రైతు విభాగం నాయకుడు ముద్దపు రమణమూర్తి, సీతానగరం మాజీ ఎంపీటీసీ బత్తుల హరి శ్చంద్రరావు, భావనపాడుకు చెందిన గొరకల శారద సింహాచలం, టెక్కలి గొల్లవీధికి చెందిన కోనారి కృష్ణ తదితర 200 కుటుంబాల వారు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. అచ్చెన్నాయుడు మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా పనిచేసి రానున్న ఎన్నికల్లో తనను ఎమ్మెల్యేగా, రామ్మోహన్ నాయుడును ఎంపీగా అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టెక్కలి, నందిగాం మండలాల పార్టీ అధ్యక్షులు బగాది శేషగిరి, పినకాన అజయ్‌కుమార్, నేతలు ఎల్ఎల్ నాయుడు, బగాది హరి, రామకృష్ణ, కింగ్, లవ కుమార్, మామిడి రాము, మట్ట పురుషోత్తం, చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

సొండి కులస్థులను ఓబీసీల్లో చేర్చేందుకు కృషి: ఎంపీ


అచ్చెన్నాయుడును సత్కరిస్తున్న సొండి కుల సంఘ నేతలు

టెక్కలి: సొండి కులస్థులను ఓబీసీల్లో చేర్చేందుకు కృషి చేస్తానని ఎంపీ కింజరాపు రామ్మోహన్‌నాయుడు అన్నారు. గురువారం నిమ్మాడ జంక్షన్‌లో సొండి కులస్థుల ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పాల్గొని మాట్లాడుతూ.. సొండి కులస్థులందరూ ఈ ఎన్నికల్లో టీడీపీని గెలిపించాల్సిన బాధ్యత తీసుకోవాల న్నారు. ఎమ్మెల్యే అచ్చె న్నాయుడు మాట్లాడుతూ.. సొండి కులస్థులకు ఏ కష్టం వచ్చినా ఆదుకు నేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నేత కింజరాపు ప్రసాద్, సొండికుల సంఘ రాష్ట్ర అధ్య క్షుడు రత్నాల శేషగిరిరావు, సాహుకారి ఎల్లారావు, దివాకర్ చౌదరి, లాభాల శేషగిరి, రత్నాల శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. ● టెక్కలి: ఎన్డీఏ కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత నెలకు రూ.4 వేలు చొప్పున 50 ఏళ్లకే పింఛన్ అందిస్తామని టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్యే కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. గురువారం కోటబొమ్మాళి మండలం వింజాంపాడు, హరిశ్చంద్రపురం గ్రామాల్లో పర్యటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఒకనెల పింఛన్ తీసుకోకపోయినా రెండు, మూడు నెలల్లో తీసుకోవచ్చని, వైసీపీ ప్రభుత్వం ఇచ్చిన పింఛన్ కంటే గంటముందు లబ్ధిదారులకు ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కింజరాపు హరిప్రసాద్, పూజారి శైలజ, వెలమల విజయ లక్ష్మీ, కామేశ్వరరావు, తర్ర రామకృష్ణ, నంబాళ్ల శ్రీనివాస్, హనుమంతు అప్పలరాజు, కర్రి అప్పారావు, లక్ష్మణరావు పాల్గొన్నారు.

రాక్షస పాలనకు చరమగీతం పాడండి: శిరీష

కాశీబుగ్గ: గడచిన ఐదేళ్లలో అన్ని వర్గాల ప్రజలకు ఇబ్బందులు పెట్టిన వైసీపీ రాక్షస పాలనకు రానున్న ఎన్నికల్లో చరమగీతం పాడాలని టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష అన్నారు. గురువారం పట్టణంలోని 7వ వార్డు అంతర్‌కుడ్డ, పెసరపాడు, నర్సిపురంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మే 13న సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా రామ్మోహన్ నాయుడును అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. కూటమి ప్రభుత్వం వల్ల రాష్ట్రంతో పాటు నియోజకవర్గంలోనూ అభివృద్ధి చెందుతాయన్నారు. కార్య క్రమంలో టీడీపీ నాయకులు వజ్జ బాబురావు, లొడగల కామేశ్వరరావు, దువ్వాడ శ్రీకాంత్, బడ్డ నాగ రాజు, సప్ప నవీన్, హేమబాబు చౌదరి, మల్లేశ్వరరావు, రవి శంకర్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన మందస వైసీపీ నాయకులు


కొండలోగాం వైసీపీ ఉప సర్పంచ్‌కు కండువా వేస్తున్న గౌతు శిరీష

పలాస/హరిపురం: పలాస టీడీపీ అభ్యర్థి గౌతు శిరీష సమక్షంలో గురువారం మందస మండలం కమలాపురానికి చెందిన వైసీపీ వార్డు సభ్యుడు కొండియా ఈశ్వరరావు, కొండియా తేజేశ్వరరావు, కొండలోగాం ఉప సర్పంచ్ సవర తేజేశ్వర్రావు, అపర్ణతో పాటు పదిహేను కుటుంబాల వారు టీడీపీలో చేరారు. పార్టీ కార్యాలయంలో వీరికి శిరీష కండువాలు కప్పి ఆహ్వానించారు.వారంతా మాట్లాడుతూ.. శిరీష విజయానికి తాము కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో నేతలు మామిడి తాతారావు, బమ్మిడి కర్రయ్య, దాసరి తాతారావు, పులారి జయకృష్ణ, బతకల కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లలో ఎంతో నష్టపోయాం: బగ్గు


జలుమూరు: నగిరికటకంలో ప్రచారం చేస్తున్న బగ్గు రమణమూర్తి

జలుమూరు: వైసీపీ ఐదేళ్ల పాలనలో రాష్ట్రంలో అభివృద్ధి లేక ఎంతో నష్టపోయామని ఉమ్మడి అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. నగిరికటకం, కొమనాపల్లి గ్రామాల్లో గురువారం సాయంత్రం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదల అభ్యున్నతికి టీడీపీ పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకుడు బలగ ప్రవీణ్, టీడీపీ మండల అధ్యక్షుడు వెలమల రాజేంద్రనాయుడు. కన్వీనర్ బగ్గు గోవిందరావు, మాజీ సర్పంచ్ భేరి ప్రసాదరావు, గురుబెల్లి ఝాన్సీరాణి తదితరులు పాల్గొన్నారు. జోనంకి పంచాయతీ గంగాధరపేట, అబ్బాయిపేట, కేఎల్ఎన్‌పేటలకి చెందిన పలువురు వైసీపీ నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. వీరికి రమణమూర్తి కండువాలు వేసి ఆహ్వానించారు. ఇద్దరు వార్డు మెంబర్లతో పాటు పలువురు వైసీపీ కార్యకర్తలు చేరారు. అలాగే జడ్పీ టీసీ మెండ విజయశాంతి, రాంబాబు నేతృత్వంలో గంగాధరపేటకు చెందిన పలువురు కార్యకర్తలు టీడీపీ తీర్థం పుచ్చు కున్నారు. ● నరసన్నపేట: రాష్ట్ర భవిష్యత్ కోసం టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడును మళ్లీ గెలిపించి సీఎంగా చేద్దామని ఉమ్మడి పార్టీల అభ్యర్థి బగ్గు రమణమూర్తి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయం ఆవరణలో 'బాబును మళ్లీ గెలిపిద్దాం' బ్యానర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో నియోజక వర్గ పరిశీలకుడు కె.వెంకటేశ్వరరావు, టీడీపీ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

మానసికోల్లాసానికి క్రీడలు దోహదం


క్రీడా పోటీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి

పలాస: విద్యార్థుల శారీరక, మానసిక ఉల్లాసానికి క్రీడలు దోహదం చేస్తాయని డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ వెంకటలక్ష్మి అన్నారు. స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో గురు వారం క్రీడా దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థి దశ నుంచి క్రీడలపై ఆసక్తి పెంపొందించుకోవాలని కోరారు. అనంతరం విద్యార్థులకు రన్నింగ్, షాట్‌పుట్, లాంగ్ జంప్, క్రికెట్ పోటీలు నిర్వహించి బహుమతులను అందించారు. కార్యక్రమంలో పీడీ మధు, వైస్ ప్రిన్సిపాల్ ఎల్.గణపతిరావు, అధ్యాపకులు, సిబ్బంది పాల్గొన్నారు.

జిల్లాకు ఎన్నికల పోలీసు పరిశీలకుడి రాక


పోలీస్ అబ్జర్వర్ దిగంబర్ పి.ప్రధాన్‌కి పుష్పగుచ్ఛం ఇస్తున్న ఎస్పీ రాధిక

శ్రీకాకుళం క్రైం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లా ఎన్నికల పరిశీలకుడిగా (పోలీసు అబ్జర్వర్) మహారాష్ట్రకు చెందిన సీనియర్ ఐపీఎస్ అధికారి దిగంబర్ పి.ప్రధాన్ గురువారం ఆయన జిల్లాకు చేరుకున్నారు. స్థానిక పోలీసు కార్యాలయం అతిథి గృహంలో ఆయనను ఎస్పీ జీఆర్ రాధిక మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఎన్నికలకు సంబంధించిన పోలీసు శాఖా పరమైన అంశాలపై చర్చించారు. శ్రీకాకుళం, ఆమదాలవలస, నరసన్న పేట, పాతపట్నం, టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజక వర్గాలకు ఎన్నికల పోలీసు పరిశీలకుడిగా వ్యవహ రించనున్నారు. ఏఎస్పీ జి.ప్రేమ్ కాజల్ ఆయనను కలిశారు.

కలెక్టర్‌ను కలిసిన ఎన్నికల పరిశీలకులు

కలెక్టరేట్: జిల్లా ఎన్నికల పరిశీలకులుగా వచ్చిన సీనియర్ ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు గురువారం కలెక్టర్ చాంబర్‌లో కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి మన్‌జీర్ జిలానీ సమూన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో సందీప్‌కుమార్ (ఐఏ ఎస్), పోలీసు పరిశీలకుడు దిగంబర్ ప్రధాన్ (ఐపీఎస్), విజయనగరం జిల్లా పార్లమెంటు నియోజకవర్గ పోలీసు పరిశీలకుడు సత్యేంద్ర పటేల్ (ఐపీఎస్), జనరల్ అబ్జర్వర్ టాట్ పర్వేజ్ ఇక్బాల్ (ఐపీఎస్) ఉన్నారు. ఎన్నికల ఏర్పాట్లపై వారు చర్చించారు.

నిశితంగా పరిశీలించండి

నరసన్నపేట: నామినేషన్ పత్రాలను నిశితంగా పరిశీలించాలని ఎన్నికల పరిశీలకుడు శేఖర్ విద్యార్థి అన్నారు. గురువారం నరసన్నపేట ఆర్వో కేంద్రాన్ని పరిశీలించారు. ఎన్నికలను సమర్థవంతంగా నిర్వహించేందుకు సిబ్బంది సమన్వయంతో ముందుకు వెళ్లాలన్నారు. ప్రచారాలపై నిఘా పెంచాలని, మద్యం, నగదు పంపిణీలపై డేగకన్ను వేయాలని నిఘా బృందా లకు ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్వో రామ్మోహన్‌రావు, ఏఆర్వో కనకారావు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు నామినేషన్ల పరిశీలన

టెక్కలి: టెక్కలి అసెంబ్లీ నియోజకవర్గంలో ఇంతవరకు దాఖలైన నామినేషన్లను శుక్ర వారం పరిశీలించనున్నట్లు ఆర్వో, సబ్ కలెక్టర్ నూరుల్ కమర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయంలో నామినేషన్ల పరిశీలన ఉంటుందని, నామినేషన్ వేసిన అభ్యర్థులు లేదా వారి సహాయకులు నిర్ణీత సమయానికి చేరుకోవాలని కోరారు. ఈనెల 18 నుంచి 25 వరకు జరిగిన నామినేషన్ల ప్రక్రియపై జనరల్ అబ్జర్వర్ సందీప్ కుమార్ గురువారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో ఆరా తీశారు. అనంతరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్నికల సామగ్రిని పరిశీలించి ఏఆర్వో మురళీకృష్ణ సూచనలు చేశారు.

రికార్డుల పరిశీలన

పాతపట్నం: తహసీల్దార్ కార్యాలయంలోని నామినేషన్ కేంద్రాన్ని జిల్లా ఎన్నికల వ్యయ పరిశీలకుడు నవీన్‌కుమార్ సోనీ గురువారం పరిశీలించారు. నియోజకవర్గపరిధిలో ఎన్నికల వ్యయ పరిశీలకులుగా వ్యవహరిస్తున్న క్షేత్రస్థాయి అధికారులతో సమావేశం నిర్వహించారు. రికార్డులను పరిశీలించి పలు సూచనలిచ్చారు. ఆయన వెంట ఆర్వో ఎం.అప్పారావు, తహసీల్దార్ వైఎస్‌వీవీ ప్రసాదరావు ఉన్నారు.

నిర్భయంగా ఓటును వేయాలి

నందిగాం: ఓటర్లు ఓటుహక్కును నిర్భయంగా వినియోగించుకోవాలని టెక్కలి నియో జకవర్గ ఎన్నికల అధికారి, సబ్‌కలెక్టర్ నూరుల్ కమర్ అన్నారు. గురువారం నరేంద్రపురంలో పోలీసు బలగాలతో మార్చ్‌ఫాస్ట్ నిర్వహించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ.. ఎన్నికల నియమావళిని తప్పనిసరిగా పాటించాలని, ఎటువంటి వివాదాలకు తావివ్వకుండా శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో టి.శివప్రసాద్, ట్రైనీ డీఎస్పీ రాజా, నందిగాం ఎస్ఐ మహ్మద్ అమీర్ ఆలీ తదితరులు పాల్గొన్నారు.

80 కుటుంబాలు టీడీపీలో చేరిక


టీడీపీలో చేరిన వారితో రవికుమార్

ఆమదాలవలస: బూర్జ మండలం అయ్యవారిపేట గ్రామ పంచాయతీ ఉపసర్పంచ్ కొత్తకోట రామినాయుడు, మరో 80 కుటుంబాల వారు గురువారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వీరికి ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ కండువాలు వేసి ఆహ్వానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం గ్రామ పంచాయతీల నిధుల ను మళ్లించి నిర్వీర్యం చేసిందని, అందువల్లే ఇటీవల అయ్యవారిపేట సర్పంచ్ ఇప్పిలి అంబు జాక్షి, సిమ్మన్న తమ అనుచరులతో టీడీపీలో చేరారని, అందుకే గ్రామమంతా రవికుమార్‌కు మద్దతు పలకాలని ఉద్దేశంతో టీడీపీలో చేరామన్నారు. ● పొందూరు: రాపాక పంచాయతీ ఇల్లయ్యగారిపేట, వావిలపల్లిపేట గ్రామాల్లో గురువారం ఉమ్మడి అభ్యర్థి కూన రవికుమార్ ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి సూపర్‌సిక్స్ పథకాలను వివరించారు. కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి పేడాడ రామ్మోహన్, బీజేపీ ఇన్‌చార్జి పి.సూరపునాయుడు, టీడీపీ మండల అధ్యక్షుడు రామ్మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఒక్క అవకాశం ఇవ్వండి: గోవిందరావు

కొత్తూరు: తనకు ఒక్క అవకాశం ఇస్తే పాతపట్నం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు అన్నారు. సోమరాజపురం, శోభనాపురం, జాతలపేట, గొల్లంగిపేట, ఆకులతంపర, వెంకటాపురం, గురండి, దాశరధిపురం, కాశీపురం గ్రామాల్లో గురువారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. సూపర్ సిక్స్ పథకాలను ఓటర్లకు వివరించారు. వెంకటాపురానికి చెందిన వైసీపీ నాయకులు మొగిలి చిన్నారావు, గాది సుబ్బారావు, సన్నిబోయిన అప్పన్న, పిండి నూకరాజుతో పాటు సుమారు 30 కుటుంబాల వారు టీడీపీలో చేరారు. వీరికి మామిడి గోవిందరావు పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.

కలమటను కలిసిన ఎంజీఆర్

పాతపట్నం: టీడీపీ పార్లమెంటరీ అధ్యక్షుడిగా నియమితులైన మాజీ ఎమ్మెల్యే కలమట వెంకట రమణమూర్తిని గురువారం ఉమ్మడి అభ్యర్థి మామిడి గోవిందరావు మర్యాద పూర్వకంగా కలిసి అభినందించారు. మీ ఆశీస్సులు కావాలని కోరారు. పార్టీ ఆదేశాల మేరకు పార్టీ విజయం కోసం కృషి చేద్దామని కలమట రమణ అన్నారు.


వైసీపీ నేతలకు కండువా కప్పుతున్న గోవిందరావు

ఘనంగా సీతారాముల కల్యాణం

సంతబొమ్మాళి: బోరుభద్రలో రాములోరి కల్యాణం గురువారం రాత్రి వైభవంగా నిర్వహించారు. శ్రీరామ నవమి ఉత్సవాల ముగింపు సందర్భంగా వేద పండితులు బూరాడ శ్రీనివాసశర్మ, బూరాడ ఆదిత్య శర్మ పర్యవేక్షణలో కల్యాణం నిర్వహించారు. పలువురు గ్రామస్థులు పాల్గొని కల్యాణాన్ని తిలకించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

ఓటు హక్కు ప్రతి ఒక్కరి బాధ్యత

ఎచ్చెర్ల: ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అనేది ప్రతి ఒక్కరి బాధ్యత అని డా. బీఆర్ అంబేడ్కర్ విశ్వ విద్యాలయం వీసీ కేఆర్ రజిని అన్నారు. 'ఓటు- విద్య-ఎన్నికల వ్యవస్థలో భాగస్వామ్యం' అనే అంశంపై అవగాహన సదస్సు గురువారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. ఓటు వేసే అవకాశం వచ్చినవారంతా ఎన్నికల్లో బాధ్యతగా పాల్గొనాలన్నారు. పీఐబీ అదనపు డైరెక్టర్ రాజేంద్ర చౌదరి మాట్లాడుతూ.. ప్రపంచంలో అతిపెద్ద ఎన్నికల ప్రక్రియ భారత్‌లోనే ఉందన్నారు. అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. జిల్లా ఫీల్డ్ పబ్లిసిటీ అధికారి బగాది తారక ప్రసాద్ అధ్యక్షతన జరిగిన సదస్సులో వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, రిజిస్ట్రార్ పి.సుజాత, జర్నలిజం విభాగం అధ్యాపకుడు ఆర్.తిరుపతిరావు, పలువురు అధ్యాపకులు, విద్యార్థినీ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

నేత్రపర్వంగా సహస్ర ఘట శిఖరాభిషేకం

టెక్కలి: కె.కొత్తూరు షిర్డీసాయి మందిరంలో గురు వారం 1008 సుగంధ ద్రవ్య కలశాలతో సహస్ర ఘట శిఖరాభిషేకం నిర్వహించారు. కాకడా హారతి, పుష్పా లంకరణ, ప్రత్యేక పూజలు, పూర్ణాహుతి చేశారు. సదానంద స్వామీ మహరాజ్, నిర్విషాయానంద స్వామీ, ప్రకాశ్ నంద, బాలకృష్ణ దాస్‌జీ మహరాజ్ ప్రత్యేక పూజా కార్యక్రమాలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తి సంగీత విభావరి, అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు భుజంగరావు తదితరులు పాల్గొన్నారు.

యోగా పీజీ కోర్సులో చేరేందుకు దరఖాస్తులు

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలో యోగా, ఫిట్‌నెస్ మెనేజ్‌మెంట్ విభాగం నిర్వహిస్తున్న ఏడాది యోగా పీజీ డిప్లమో కోర్సులో చేరేందుకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ పి.సుజాత ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 15వ తేదీలోగా దర ఖాస్తు చేసుకోవాలని, రూ.500 అపరాధ రుసుంతో జూన్ 27వ తేదీ వరకు గడువు ఉంటుందన్నారు. ఈ కోర్సులో చేరేందుకు ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత ఉండాలన్నారు. ఈ కోర్సుకు రూ.10 వేలు ఫీజు ఉంటుందన్నారు. వర్సిటీ విద్యార్థులు ట్యూషన్ ఫీజులో 30 శాతం, బోధన, బోధనేతర సిబ్బందికి ఫీజులో 50 శాతం రాయితీ ఉంటుందని ఆమె పేర్కొన్నారు.

మలేరియాపై అవగాహన కలిగి ఉండాలి

అరసవల్లి: మలేరియా వ్యాధి, నివారణపై అవగాహన కలిగి ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ, అర్బన్ డీపీఎం డాక్టర్ ఎం.లింగరాజు అన్నారు. ప్రపంచ మలేరియా దినోత్సవం సందర్భంగా గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయం నుంచి ర్యాలీ నిర్వహించారు. దోమకాటుతో మలేరియా సంభవిస్తుందని చలి, వణుకు, విపరీతమైన జ్వరం దీని లక్షణాలన్నారు. తక్షణం వైద్య పరీక్షలు చేయించుకుంటే మలేరియా నుంచి దూరంగా ఉండవచ్చన్నారు. దోమ తెరలు వాడాలని, ఇళ్లల్లో క్రిమిసంహారక మందు పిచికారీ చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో జిల్లా మలేరియా అధికారి పీవీ సత్యనారాయణ, మంత్రి వెంకటస్వామి, ఎల్.శ్రీకాంత్, పైడి వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ఎచ్చెర్ల: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ అనుబంధ డిగ్రీ కళాశాలల్లో చదువుతున్న విద్యార్థుల మూడో సెమిస్టర్ రెగ్యులర్, సప్లిమెంటరీ ఫలితాలను గురువారం విడుదల చేశారు. బీఏ బీకాం, బీఎస్సీ, బీబీఏ, బీసీఏ కోర్సుల్లో మూడో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలకు 7186 మంది హాజరు కాగా 3337 మంది ఉత్తీర్ణులై 46.44 ఫలితాలు సాధించారు. సప్లిమెంటరీ పరీక్షలకు 5356 మందిలో 52.51 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు డీన్ ఎస్.ఉదయ్‌భాస్కర్ తెలిపారు.

ఓపెన్ స్కూల్ ఫలితాలు...

గుజరాతీపేట: ఓపెన్ స్కూల్ సొసైటీ ద్వారా పదో తరగతి, ఇంటర్మీడియట్ పరీక్షా ఫలితాలు గురువారం విడుదలైనట్టు డీఈవో కె.వెంకటేశ్వరరావు తెలిపారు. జిల్లాలో టెన్త్ పరీక్షలకు 767 మంది హాజరు కాగా 280 (36.51 శాతం) మంది, ఇంటర్‌లో 1705 మందికి గాను 561 (32.90 శాతం)మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. పది ఫలితాల్లో రాష్ట్రంలో జిల్లా 17, ఇంటర్మీడియట్‌లో 23వ స్థానంలో నిలిచిందన్నారు. అలాగే ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విద్యాపీఠం గుంటూరు జూన్ ఒకటవ తేదీ నుంచి నిర్వహించనున్న ఎస్ఎస్‌సి, ఇంటర్ పరీక్షల ఫీజు చెల్లింపు గడువు తేదీ ప్రకటించారన్నారు. పరీక్షలకు హాజరవుతున్న విద్యార్థులు ఎస్ఎస్‌సి సబ్జెక్టుకు రూ.100, ఇంటర్ పరీక్ష సబ్జెక్టుకు రూ.150, ప్రాక్టికల్ సబ్జెక్టుకు రూ.100 చొప్పున ఈనెల 29 నుంచి మే 4వ తేదీ వరకు చెల్లించవచ్చన్నారు. రూ.25 అపరాధ రుసుంతో మే 5, 6వ తేదీల్లో, రూ.50 అపరాధ రుసుంతో 7,8 తేదీల్లో చెల్లించవచ్చని ఆ ప్రకటనలో తెలిపారు.

నవరత్నాల పేరిట మోసం: కృపారాణి

టెక్కలి: నవరత్నాలు పేరిట సీఎం జగన్ ప్రజలకు మోసం చేశారని కేంద్ర మాజీ మంత్రి, టెక్కలి అసెంబ్లీ అభ్యర్థిత డాక్టర్ కిల్లి కృపారాణి అన్నారు. గురువారం ఇండియా కూటమి నాయకులతో ఆమె స్వగృహంలో విలేకరులతో మాట్లాడుతూ.. గడచిన ఐదేళ్లలో రెండు లక్షల కోట్ల మద్యాన్ని రాష్ట్ర ప్రభుత్వమే అమ్మి రూ.40 వేల కోట్లు దోచుకొని ప్రజల ప్రాణాలతో చెలగాటమాడిందని విమర్శించారు. శ్రీకాకుళం పార్లమెంట్ అభ్యర్థి పేడాడ పర మేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వడంలో బీజేపీ, వైసీపీలు విఫలమయ్యా యన్నారు. నిత్యావసర వస్తువుల ధరల పెరుగుదలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణ మన్నారు. సమావేశంలో సీపీఎం, సీపీఐ నాయకులు నంబూరు షణ్ముఖరావు, హనుమంతు ఈశ్వరరావు, చాపర వెంకటరమణ, కాంగ్రెస్ నాయకులు టీబీజీ గుప్త, దాట్ల లింగమూర్తి పాల్గొన్నారు.

వడ దెబ్బ తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి

పలాసరూరల్: వేసవి తీవ్రత ఎక్కువగా ఉన్నందున వడదెబ్బకు గురి కాకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని రెంటికోట పీహెచ్‌సీ వైద్యాధికారి సునీల్‌కుమార్ అన్నారు. గురువారం ర్యాలీ నిర్వహించి ఉపాధి వేతనదారులకు అవగాహన కలిగించారు. ఉదయం 9 గంటల నుంచి 4 గంటల వరకు అవసరమైతేనే బయటకు వెళ్లాలని, కాటన్ దుస్తులు ధరించాలని, తలకు టోపీ పెట్టుకోవాలని సూచించారు. మజ్జిగ, చల్లని నీరు, నిమ్మరసం, కొబ్బరి నీళ్లు తీసుకోవాలన్నారు. వైద్యాధికారి ఎస్.మౌనిక సిబ్బంది పాల్గొన్నారు.

వ్యాధులు ప్రబలకుండా చర్యలు

ఎల్ఎన్‌పేట: గ్రామాల్లో పారిశుధ్య లోపం వల్ల మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల తో పాటు ఇతర వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని తురకపేట, ఎల్ఎన్‌పేట వైద్యాధికారులు ఎ.లక్ష్మీదీప్, నీతూ, ప్రియాంక ఆధ్వర్యంలో ప్రపంచ మలే రియా దినోత్సవం సందర్భంగా ర్యాలీలు చేపట్టారు. ఒకవేళ జ్వరాలు సోకితే పీహెచ్‌సీల్లో చికిత్స పొందాలన్నారు. దోమలను నివారించేందుకు డ్రైనేజీల్లో సైపోత్రిన్ లిక్విడ్‌ను తగిన మోతాదులో స్ప్రే చేయాలన్నారు. కార్యక్రమాల్లో వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కేంద్రీయ విశ్వవిద్యాలయ సదస్సుకు శరత్‌బాబు

శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం సదస్సుకు ప్రముఖ రచయిత జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. 'పత్రికలే తెలుగుదనానికి ప్రతీకలు' అనే అంశంపై శ్రీకాకుళం నుంచి శరత్‌బాబు పంపిన పరిశోధన పత్రాన్ని ఎంపిక చేశారని, ప్రసంగం శుక్రవారం ఆన్‌లైన్‌లో ఉంటుందని ఆయన తెలిపారు. శరత్‌బాబు ఎంపిక పట్ల రచయితలు ఈ వేమన, వి.రాజారావు, కుమార్‌రాజు హర్షం వ్యక్తం చేశారు.